# విజయభాను

44th వార్షికోత్సవం
విజయభాను

విశాఖపట్నం, గురువారం 19-11-2020 VIJAYABHANU DAILY * VISAKHAPATNAM సంపుటి : 44 సంచిక : 60 పేజీలు : 8 వెల : 1 రూపాయి


## డిసెంబర్ 25న రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం

- డిసెంబరు 25న డి-ఫామ్ పట్టాలతో ఇళ్ల స్థలాల పంపిణీ
- కేవలం ఒక్క రూపాయితో 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లకు అగ్రిమెంట్ ఆఫ్ సేల్
- కోవిడ్ సెకండ్ వేవ్ వణికిస్తోంది.. పలు దేశాల్లో మరోసారి లాక్‌డౌన్
- ఢిల్లీలో మరో లాక్‌డౌన్‌కు రెడీ. ఫ్రాన్స్, లండన్‌లో షట్‌డౌన్
- పూర్తి నాణ్యతతో ఎక్కడా లోటు లేకుండా రైతులకు అందాలి

**'స్పందన' వీడియో కాన్ఫరెన్సులో సీఎం జగన్**

తాడేపల్లి: కోర్టు స్టే ఉన్న చోట్ల మినహా, వివిధ కారణాలతో నిలిచిపోయిన ప్రాంతాల్లో డిసెంబరు 25న డి-ఫామ్ పట్టాలతో ఇళ్ల స్థలాలు పంపిణీ చేస్తామని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. అదే రోజున 15 లక్షల ఇళ్ల నిర్మాణం కూడా మొదలు పెడతామని పేర్కొన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకుంటే అర్హులకూ 90 రోజుల్లో అవకాశం ఇస్తామన్నామని, ఈ మేరకు 1.20 లక్షల మందిని కొత్తగా జాబితాలో చేర్చినట్లు వెల్లడించారు. తన క్యాంపు కార్యాలయంలో స్పందన కార్యక్రమంపై సీఎం జగన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, జేసీలతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇళ్ల పట్టాల పంపిణీ, జగనన్న తోడు పథకం, ఉపాధి హామీ పనులు, నాడు- నేడు, కోవిడ్-19 నివారణ తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. డిప్యూటీ సీఎం, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి ఆళ్ల నాని, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, శ్రీరంగనాథరాజు, ఆదిమూలపు సురేష్, డీజీపీ గౌతమ్ సవాంగ్, వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ సమీక్షలో పాల్గొన్నారు.

వాటి మార్కెట్ విలువ రూ. 23 వేల కోట్లు

ఈ సందర్భంగా సీఎం జగన్ మాట్లాడుతూ.. "తొలుత మార్చి 25న ఉగాది రోజు ఇవ్వాలనుకున్నాం. ఆ తర్వాత ఏప్రిల్ 14, అంబేడ్కర్ జయంతి రోజున, ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తైన సందర్భంగా మే 30న, దివంగత నేత వైయస్సార్ జయంతి రోజు అయిన జూలై 8న, ఆ తర్వాత ఆగస్టు 15న, చివరగా అక్టోబరు 2 గాంధీ జయంతి రోజున పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనుకున్నాం. కానీ అన్నీ వాయిదా పడ్డాయి. ప్రతిపక్ష కుటిల రాజకీయాల వల్ల పేదల ఇళ్ల స్థలాలు ఇవ్వడం కోసం న్యాయపోరాటం చేయాల్సి వస్తోంది"అని

తరువాయి 2లో..

## భారత్‌తో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నా

న్యూఢిల్లీ : భారత ప్రధాని నరేంద్ర మోదీతో కలిసి పని చేసేందుకు ఎదురుచూస్తున్నాని జో బైడెన్తెలిపారు. ఇటీవల జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో విజయం సాధించిన బైడెన్‌కు ప్రధాని మోదీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇరువురు నేతలు కీలక అంశాలపై చర్చించారు.

కొవిడ్మహమ్మారి సహా ప్రపంచ సవాళ్లపై మోదీతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నట్లు బైడెన్ పేర్కొన్నారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పునరుద్ధరణ చర్యలు, సురక్షితమైన, సంపన్నమైన ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని నిర్వహించేందుకు కట్టుబడి ఉన్నట్లు ఆయన తెలిపారు.

'కరోనా కట్టడితో పాటు అంతర్జాతీయ సవాళ్లపై ప్రధాని మోదీతో కలిసి పనిచేసేందుకు ఎదురు చూస్తున్నా.

భవిష్య త్తులో ఎదురయ్యే ఆరోగ్య సంక్షోభాలను ఎదుర్కోవడం, పర్యావరణ మార్పులను తగ్గించటం, ప్రపంచ ఆర్థిక పునరుద్ధరణ చర్యలను ప్రారంభించటం, దేశీయంగా, విదేశాల్లో ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం, సురక్షితమైన, సుసంపన్న మైన ఇండో-పసిఫిక్ ప్రాంతాన్ని నిర్వహించటం పైనా కలిసి పనిచేయాలనుకుంటున్నాం' అని జో బైడెన్ పేర్కొన్నారు.

అమెరికా - భారత్వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని విస్తరించడం, బలోపేతం చేయడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు

తరువాయి 2లో..

## విద్యుత్ ఉద్యోగుల విభజనపై సుప్రీంలో విచారణ

దిల్లీ: తెలుగు రాష్ట్రాల మధ్య విద్యుత్ ఉద్యోగుల విభజనపై ఇవాళ సుప్రీం కోర్టులో విచారణ జరిగింది. విభజన విషయంలో జస్టిస్ ధర్మాధికారి కమిటీ ముగింపు నివేదికపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ తెలంగాణ విద్యుత్ సంస్థలు దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ అశోక్ భూషణ్, జస్టిస్ ఎంఆర్ షాలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. తెలంగాణ విద్యుత్ సంస్థల తరపున న్యాయవాది రాకేశ్ ద్వివేది వాదనలు వినిపించారు. ఆర్థిక సమతుల్యత అంశాన్ని పరిగణనలోకి తీసుకోకుండానే ఉద్యోగుల కేటాయింపులు చేశారని న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. ఏపీ స్థానికత కలిగిన ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను తెలంగాణకు కేటాయించడాన్ని ఉద్యోగులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని కోర్టుకు విన్నవించారు. ఉద్యోగల విభజన విషయంలో తొలుత జస్టిస్ ధర్మాధికారి కమిటీ ఇచ్చిన నివేదిక చట్టబద్ధతను తేలుస్తామని.. ఆ తర్వాత ఎస్సీ, ఎస్టీ ఉద్యోగులను

తరువాయి 2లో..

## ఎన్నికలు ఎప్పుడు జరిగినా మేం సిద్ధం

**ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి**

తాడేపల్లి : ఒక ప్రభుత్వంగా ప్రజలందరి బాధ్యత తమపై ఉంది కాబట్టి స్థానిక సంస్థల ఎన్నికలు ఇప్పుడు వద్దంటున్నామని.. రాజకీయ పార్టీగా ఎప్పుడు ఎన్నికలు జరిగినా తాము సిద్ధమేనని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనిషి అన్నది అందరికీ తెలిసిందేనని, 90 శాతానికి పైగా సీట్లు గెలుచుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. "ఒకటీ రెండు కేసులు ఉన్నప్పుడు ఎన్నికలు వాయిదా వేసి, వేల కేసులు

తరువాయి 2లో..

## ఈ పరిస్థితుల్లో ఎన్నికలు ప్రజాహితం కాదు

**ఏపీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డకు సీఎస్ నీలం సాహ్ని లేఖ**

అమరావతి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ చీఫ్ సెక్రటరీగా నీలంసాహ్ని రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్‌కు లేఖ రాశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్రంలో పరిస్థితులు సరిగా లేవని లేఖలో స్పష్టం చేశారు. అధికార యంత్రాంగమంతా కరోనా విధుల్లో ఉన్నారని, ఎన్నికల నిర్వహణపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించాల్సిన అవసరం ఇప్పుడు లేదని ఆమె పేర్కొన్నారు. రాష్ట్రంలో కరోనా పాజిటివ్ కేసులు ఎక్కువగా ఉన్నాయని తెలిపారు. అదీకాక గ్రామీణ ప్రాంతాలకు కూడా కరోనా విస్తరించిందనని, ఇలాంటి పరిస్థితుల్లో ఎన్నికలు నిర్వహిస్తామనడం ప్రజాహితం కాదని పేర్కొన్నారు. కరోనాను ఎదుర్కోవడంలో ఒక్కో రాష్ట్రం ఒక్కో వ్యూహాన్ని అమలు చేస్తోందని, ఒక రాష్ట్రాన్ని, మరో రాష్ట్రంతో పోల్చడం తగదన్నారు. చదవండి: రైతుల శ్రమ తెలిసిన ప్రభుత్వం

ఇది.. రాష్ట్రంలో ఇప్పటికే 6,890 మంది కరోనాతో మరణించారని, రాబోయే రోజుల్లో కోవిడ్ తీవ్రత ఎక్కువగా ఉంటుందని కేంద్రం కూడా తెలిపిందని ఆమె గుర్తుచేశారు. ఎన్నికల నిర్వహణపై ఎన్నికల కమిషన్ తన నిర్ణయాన్ని పునఃసమీక్షించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు సమాయత్తం అయ్యాక ఆ చర్యలకు శ్రీకారం చుట్టడం మేలుని పేర్కొన్నారు. ఈ అంశాలన్నింటిని ఎన్నికల కమిషన్ సానుకూలంగా పరిగణిస్తుందని భావిస్తున్నానని నీలంసాహ్ని లేఖలో ప్రస్తావించారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీలకు వచ్చే ఫిబ్రవరిలో ఎన్నికలు నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్ణయించిందంటూ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ మంగళవారం ప్రొసీడింగ్స్ పేరుతో ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.

## ఏపీలో కొత్తగా 1,236 కరోనా కేసులు

అమరావతి : ఏపీలో కొత్తగా 1,236 కరోనా కేసులు నమోదయ్యాయి. గడిచిన 24 గంటల్లో 9 మంది మృత్యువాత పడినట్లు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ తన బులెటిన్‌లో పేర్కొంది. తాజా కేసులతో కలిపి రాష్ట్రంలో మొత్తం కేసుల సంఖ్య 8,57,395కి చేరింది. ఇప్పటి వరకు 6,899 మంది మృత్యువాత పడ్డారు. తాజాగా గడిచిన 24 గంటల్లో మరో 1,696 మంది కరోనా నుంచి పూర్తిగా కోలుకున్నారు. దీంతో ఇప్పటి వరకు కోలుకున్న వారి సంఖ్య 8,33,980 చేరింది. ప్రస్తుతం రాష్ట్రంలో 16,513 యాక్టివ్ కేసులు న్నట్లు వైద్యారోగ్య శాఖ వెల్లడించింది. గడిచిన 24 గంటల్లో 69,618 కరోనా పరీక్షలు నిర్వహించగా.. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 93,33,703 మందికి కొవిడ్ పరీక్షలు నిర్వహించినట్లు బులెటిన్‌లో తెలిపింది.

## ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ని కలిసిన కె.కె రాజు



తాడేపల్లి : బుధవారం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కె.కె రాజు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న పలు సమస్యలను, జరగవలసిన అభివృద్ధి పనులను వివరించారు. వీటిలో ముఖ్యంగా సీతమ్మధార అల్లూరి సీతారామరాజు విగ్రహం వెనుక నుండి డి.ఎల్. బి. గ్రౌండ్, మాధవధార, జాతీయ రహదారి ఆర్ అండ్ బి వరకు గల రోడ్ అభివృద్ధి, నియోజకవర్గ పరిధిలో కమ్యూనిటీ హాల్స్,అంగన్వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు,మెట్లు,రైలింగ్, నియోజకవర్గంలో ఇండోర్ స్టేడియం, 34వార్డు సాలిగ్రామపురం పోర్టు స్కూల్ సమస్య, మర్రిపాలెంలో ముస్లిం ఈదిగా స్థల సమస్యలు గురించి, అలాగే 34వార్డు ఏ ఎస్ ఆర్ నగర్లో ఏ పి టిడ్కో గృహాలు పూర్తి చేయుట ఈ సమస్యలు అన్నింటిని త్వరితగతిన పూర్తి చేసేవిదంగా ఆదేశించాలని కోరారు.

## ఏపీ హైకోర్టు ఆదేశాలపై సుప్రీం స్టే

దిల్లీ: కరోనా నేపథ్యంలో మార్చి, ఏప్రిల్ నెలల్లో ఏపీ ఉద్యోగుల జీతాల చెల్లింపు అంశంపై జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. మార్చి, ఏప్రిల్‌లో 50 శాతం జీతాల చెల్లింపుపై రాష్ట్ర ప్రభుత్వ జీవోను కొట్టేస్తూ బకాయిలను 12 శాతం వడ్డీతో 2 నెలల్లోగా చెల్లించాలని ఆగస్టులో ఏపీ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలను సవాల్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కరోనా సంక్షోభంతో ఆర్థిక పరిస్థితి దెబ్బతిన్నందున వడ్డీ చెల్లించ లేమని ప్రభుత్వం సర్వోన్నత న్యాయస్థానానికి తెలియజేసింది. ప్రభుత్వం తరపు న్యాయవాది వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. 12 శాతం వడ్డీ చెల్లించాలన్న హైకోర్టు ఆదేశాలపై స్టే విధిస్తూ విచారణ వాయిదా వేసింది.

## నేడు బాలల హక్కులు, దత్తతపై అవగాహన ర్యాలీ

శ్రీకాకుళం : ఈ నెల 19న బాలల హక్కులు, దత్తత అవ గాహనపై ర్యాలీని నిర్వహించనున్నట్లు జిల్లా మహిళ మరియు శిశు అభివృద్ధి సంస్థ సహాయ పథక సంచాలకులు పి.రాధాకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ దత్తత మాసోత్సవాలు- నవంబరు 2020 మరియు బాలల హక్కుల వారోత్సవాలు-2020 లో భాగంగా 19వ తేదీ సాయంత్రం 3.30 గం. కు పట్టణంలోని పొట్టి శ్రీరాములు జంక్షన్ నుండి 200 మందితో బాలల హక్కులు మరియు దత్తతపై అవగాహనా ర్యాలీ నిర్వహిం చడం జరుగుతుందని చెప్పారు. సదరు కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిధిగా విచ్చేయనున్నట్లు తెలిపారు.

### ఓ.సి సంఘం శ్రీకాకుళం పట్టణం అధ్యక్షులుగా

## భాస్కరభట్ల

శ్రీకాకుళం : నరసన్నపేట మండలం, సత్యవరం గ్రామానికి చెందిన భాస్కర భట్ల జగదీశ్వరరావును ఓ.సి సంఘం శ్రీకాకుళం పట్టణం అధ్యక్షుడిగా నియ మించడం జరిగినది. సత్య వరం గ్రామం లోని భాస్కరభట్ల నివాసం నందు ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జగదీశ్వరరావు మాట్లాడుతూ ఓ.సి కులాల్లోని బ్రాహ్మణ ,వైశ్య, కమ్మ, కాపు, రెడ్డి ,ముస్లిం తదితర కులాలలో పేదరికంతో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని వారందరినీ రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు .10 వేల కోట్లతో ఓసి కార్పొరేషన్ ఏర్పాటు చేసేలా జరగబోయే అసెంబ్లీ సమావేశాలలో తీర్మానం చేయాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .కేంద్ర ప్రభుత్వం కల్పించిన 10 శాతం ఇ.డబ్ల్యూ.ఎస్. రిజర్వేషన్లు రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేసి నిరుపేద ఓ.సి కుటుంబాలను ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఇ.డబ్ల్యూ.ఎస్. రిజర్వేషన్ల అమలు చేసే వరకు పోరాటం చేయడానికి రాష్ట్రంలోని ఓ.సీలు అందరూ సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. నా మీద నమ్మకంతో నాకు శ్రీకాకుళం పట్టణ అధ్యక్ష పదవి లో నియమించిన ఓ.సి సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు కందనూరు వెంకట సుబ్బారెడ్డి గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

### సంక్షేమ మరియు విద్య సహాయకులు పోస్టుకు ఎంపికైన అభ్యర్థులకు 20న నియామక ఉత్తర్వులు జారీ

విశాఖపట్నం : జిల్లాలో గ్రామ సచివాలయాలలో సంక్షేమ మరియు విద్య సహాయకులు పోస్ట్ కు ఎంపిక అయిన అభ్యర్థులకు తేది: 20.11.2020 న అనగా శుక్రవారం నియామక ఉత్తర్వులు జారి చేయబడును. అదే రోజు కౌన్సిలింగ్ ద్వారా సచివాలయాలను కేటాయించబడును.

కావున సంయుక్త సంచాలకుల కార్యాలయం, బుద్ధ భవనం, ఎంవీపీ కాలనీ, సెక్టార్-09, విశాఖపట్నం నందు అర్హులైనటు వంటి అభ్యర్థులు నియామక ఉత్తర్వులు పొందుట మరియు కౌన్సిలింగ్ కు హాజరు కావల్సిందిగా కోరడమైనది. తగు సమాచారం కొరకుకార్యాలయ ఫోన్ నెం. 0891-2551001 కి సంప్రదించగలరు.

### టిబి యూనిట్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా సిద్ధం
### జిల్లా క్షయ నివారణ అధికారి డా. యన్.అనూరాధ

శ్రీకాకుళం : జిల్లా క్షయ నివారణ కార్యాలయం టి.బి.యూనిట్లలో ఏడాది కాలానికి పనిచేయుటకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితా ( మెరిట్ లిస్ట్ ) ను www.srikakulam.ap.gov.in వెబ్ సైట్ నందు పొందుపరచడం జరిగిందని జిల్లా క్షయ నివారణ అధికారి డా. యన్.అనూరాధ పేర్కొన్నారు.

ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేసారు. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు జిల్లా క్షయ నివారణ కార్యాలయం టి.బి.యూనిట్లలో ల్యాబ్ టెక్నీషియన్, టి.బి.హెల్త్ విజిటర్, టి.బి.ల్యాబ్ సూపర్ వైజర్, సీనియర్ టి.బి.ల్యాబ్ సూపర్ వైజర్, సీనియర్ ట్రీట్ మెంట్ సూపర్ వైజర్, ఒక డాట్ ప్లస్ - హెచ్ఐబీ సూపర్ వైజర్ పోస్టులకు ఏడాది కాలానికి పనిచేయుటకు అర్హత కలిగిన అభ్యర్థుల నుండి దరఖాస్తులను కోరిన సంగతి విదితమే. ఈ పోస్టులకు 811 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా అభ్యర్థుల నుండి వచ్చిన గ్రీవెన్స్ లను పరిశీలించిన పిదప రెండు ల్యాబ్ టెక్నీషియన్లు, ఇద్దరు టి.బి.హెల్త్ విజిటర్లు, రెండు సీనియర్ టి.బి.ల్యాబ్ సూపర్ వైజర్లు, ఒక సీనియర్ ట్రీట్ మెంట్ సూపర్ వైజర్, ఒక డాట్ ప్లస్ - హెచ్ఐబీ సూపర్ వైజర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల తుది జాబితాను ఆన్ లైన్ లో, టి.బి.కార్యాలయం మరియు రిమ్స్ ప్రభుత్వ ఆసుపత్రి రూమ్ నెం.18 నందు పొందుపరచడం జరిగిందని ఆమె వివరించారు.

### 30 లోగా జర్నలిస్టు హెల్త్ స్కీమ్

## ప్రీమియం చెల్లించాలి

శ్రీకాకుళం : రాష్ట్ర ప్రభుత్వం వర్కింగ్ జర్నలిస్టు హెల్త్ స్కీం పథకాన్ని 2020-21 ఆర్థిక సంవత్సరానికి పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో యం.యస్ నెం. 122, తేది: 01.10.2020న ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా అక్రిడిటేషన్లు కలిగి (1 అక్టోబరు నెల నుంచి డిసెంబర్ 31 2020) వరకు రెన్యూవల్ చేయించుకున్న వర్కింగ్ జర్నలిస్టులు అందరూ ఈ పథకం క్రింద నవంబరు 30వ తేది లోపు ప్రీమియం మొత్తం రూ. 1250/- చెల్లించాలి. www.cfms.ap.gov.inవెబ్ సైట్ ద్వారా క్రింద తెలిపిన పద్దుకు ప్రీమియం మొత్తాన్ని చెల్లించాలి. ప్రస్తుతం రెన్యువల్ చేసుకున్న వారు, కొత్తగా చెల్లించిన వారికి 2021 మార్చి 31 వరకు పథకం వర్తిస్తుంది.

Head of Account : 8342-00-120-01-03-001-001 DDO Code: 2703-0802-003 ప్రీమియం చెల్లించిన జర్నలిస్టులు ఒరిజ నల్ చలానా, రెన్యూవల్ చేసుకున్న అక్రిడిటేషన్ జిరాక్సు కాపీలను జిల్లా సమాచార పౌర సంబం ధాల శాఖ కార్యాలయంలో సమర్పించాలి.

## అభివృద్ధి, నిర్వహణ పేరుతో వైజాగ్ స్టీల్‌ప్లాంట్ మైన్స్ ప్రయివేటీకరణ చర్యలను ఉపసంహరించాలి : సీపీఎం డిమాండ్

### రాష్ట్ర ప్రభుత్వం తక్షణం స్పందించాలి

విశాఖపట్నం : అభివృద్ధి, నిర్వహణ పేరుతో ఆంధ్ర రాష్ట్రం లోని జగ్గయ్యపేట, మాధ వరంలో ఉన్న విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సంబంధించిన మైన్స్‌ను ప్రయి వేటు వారికి అప్పగించేం దుకు కేంద్ర బిజెపి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను తక్షణం ఉపసంహరించుకోవా లని సిపిఎం నగర కమిటీ డిమాండ్ చేస్తోంది. రాష్ట్ర ప్రభు త్వం ఈ చర్యను వ్యతిరేకిస్తూ కేంద్రానికి వెంటనే లేఖ రాయా లని కోరుతోంది. విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ఐరన్ ఓర్ గనులు కేటాయించని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలో విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు ఉన్న సున్నపు రాయి గనులను ప్రయివేటీ కరించడానికి ఇప్పటికే బిడిఒ అనే కన్సల్టెన్సీకి అప్పగించింది. విశాఖ పట్నం స్టీల్‌ప్లాంట్ యొక్క జగ్గయ్యపేట, మాధవరంలో ఉన్న గనులను పూర్తిగా ప్రయివేటీకరించేందుకు, అక్కడున్న కార్మికు లను తొలగించేందుకు అవసరమైన చర్యలను సూచించాలని కన్సల్టెన్సీకి అప్ప జెప్పారు. ఈ చర్యలు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణలో భాగంగానే తీసుకుంటు న్నారు. వీటిని సిపిఎం తీవ్రంగా వ్యతిరేకించింది. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు లేకపోవడం వల్ల ఒక టన్ను ఇనుముకు అదనంగా రూ.3000 ఉత్పత్తి ఖర్చు అవుతోంది. ఇది విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ లాభాలను దిగ్గోసుకు వెళ్తోంది. ప్రయివేటు స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయిస్తూ వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించకుండా తీవ్ర వివక్ష చూపిస్తున్నారు. ఇప్పుడు ఏకంగా దక్షిణ కొరియాకు చెందిన పోస్కోకు వైజాగ్ స్టీల్‌ప్లాంట్ భూములను హైగ్రేడ్ స్టీల్‌ప్లాంట్ పేరుమీద కట్టబెడుతున్నారు. దీని వెనుక వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను పోస్కోకు కట్టబెట్టాలన్న కుట్ర దాగి ఉంది.

ఈ చర్యలు వైజాగ్, ఉత్తరాంధ్ర అభివృద్ధిని చావు దెబ్బతీస్తున్నాయి. ఈ చర్యలను టిడిపి కూడా వ్యతిరేకించకుండా బిజెపిని సమర్థిం చడాన్ని సిపిఎం ఖండిస్తోంది.

## మెప్మా జనతా బజార్లు - సుస్థిరమైన జీవనోపాధి మార్గాలు

విశాఖపట్నం : రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో ఉన్న వైఎస్ఆర్ ఆసరా, చేయూత అక్కచెల్లెమ్మలకు లబ్ధిచేకూర్చడముతో పాటు వారి సుస్థిరమైన జీవనోపాధి కల్పించడమే లక్ష్యముగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి మెప్మా ఆధ్వర్యములో జనత బజార్ల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భముగా మెప్మా మిషన్ డైరెక్టర్ శ్రీమతి వి. విజయ లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆశయమైన అక్కచెల్లమ్మల సుస్థిర జీవనోపాధి కల్పనను సాధించేందుకు మెప్మా నిర్విరామముగా కృషి చేస్తుందని ఇందులో భాగముగానే ప్రభుత్వం ప్రతిష్టాత్మకముగా అమలు చేస్తున్న వైఎస్ఆర్ చేయూత, వైఎస్ఆర్ ఆసరా వంటి పథకాలతో పాటు మరింత తోడ్పాటు అందించేలా ప్రముఖ బ్రాండ్లైన రిలయన్స్, హెచ్యుఎల్, ఐటీసి ఉత్పత్తులతో పాటు కూరగాయలు, పండ్లు , డైరీ , పౌల్ట్రీ , ధాన్యాలు, నూనెలు, గిరిజన ఉత్పత్తులు, ఎఫ్ఎస్ఎన్ఎఐ ద్రువికరణ పొందిన ఆహార ఉత్పత్తులు, చేనేత మరియు హస్తకళ ఉత్పత్తులను ఇందులో విక్రయించేలా జిల్లాలలోని ప్రతి ఒక్క పట్టణములో జనతా బజార్లను ఏర్పాటు చేసేందుకు ఈ సమావేశం నిర్వహించామని తెలియజేసారు. ఈ జనతా బజార్ల ద్వారా మెప్మా పరిధిలోని స్వయం సహాయక సంఘ సభ్యులు తయారు చేస్తున్న అన్ని రకాల ఉత్పత్తులను విక్రయించడమే కాకుండా ఆయ పరిధిలో ఉన్న చేయూత దుకాణాలకు ఈ బజార్లు డిస్ట్రిబ్యూషన్ పాయింట్ గా ఏర్పాటు చేసేందుకు చర్చించడం జరిగింది. అలాగే ఈ జనతా బజార్లకు పట్టణ సమాఖ్యలు నోడల్ ఏజెన్సీలుగా వ్యవహరిస్తాయని తెలియజేసారు. ఈ బజార్ల ద్వారా లబ్ధిదారులకు జీవనోపాధి కల్పనతో పాటు ఇటు ప్రజలకు తక్కువ ధరకు నాణ్యమైన ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని తెలియజేసారు. మెప్మా రాష్ట్ర కార్యాలయములో నిర్వహించిన ఈ సమావేశములో మార్కెటింగ్ ప్రతినిధులు, మెప్మా రాష్ట్ర కార్యాలయ అధికారులు, గుంటూరు, కడప జిల్లాల మెప్మా పథక సంచాలకులు, తదితరులు పాల్గొన్నారు.

## భక్తులకు ప్రసాదం పంపిణీ

గాజువాక : పెదగంట్యాడ గంగవరం గ్రామంలో కొత్తమ్మ తల్లి గుడి దగ్గర నాగుల చవితి సందర్భంగా బుధవారం 64 వ వార్డు వై ఎస్ ఆర్ సి పి కార్పొరేటర్ అభ్యర్థి ధర్మాలు శ్రీనివాస్ ఆధ్వర్యంలో పులిహోర వాటర్ ప్యాకెట్స్ గాజువాక ఇంచార్జి దేవన్ రెడ్డి, 74 వ వార్డు వైఎస్ఆర్సిపి కార్పొరేటర్ అభ్యర్థి వంశీ రెడ్డి చేతుల మీదగా పంపిణీ చేశారు.

అనంతరం దేవన్ రెడ్డి వంశీ మాట్లాడుతూ నాగుల చవితిని పురస్కరించుకుని పుట్టల వద్దకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం ప్రసాదం , వాటర్ ప్యాకెట్స్ పంపిణీ చేయడం జరిగిందని అన్నారు. నాగుల చవితిని ప్రజలందరూ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారని నాగేంద్రుని ఆశీస్సులు ఎల్లప్పుడు ఉండాలని కోరుకుంటున్నామ న్నారు. ఈ కార్యక్రమంలో గంగవరం వైఎస్ఆర్సిపి నాయకులు, యువకులు పాల్గొన్నారు.

## మద్యం మత్తులో ఆత్మహత్యాయత్నం

### బాధితుడిని ఒడ్డుకు చేర్చిన గజ ఈతగాళ్లు

విశాఖపట్నం : మద్యం తాగి సముద్ర అలలను దాటుకుంటూ లోపలికి వెళ్తున్న వ్యక్తిని గజ ఈతగాళ్లు రక్షించారు. వివరాలు ఇలా ఉన్నాయి. వ రాజమహేంద్రవరం నుంచి శ్రీకాకుళం వెళ్తున్న ఉమ్మడి రాంబాబు (25) విశాఖలో దిగాడు. మధ్యాహ్నం సుమారు 3 గంటల సమయంలో మద్యం తాగి పాండురంగాపురం తీరానికి వచ్చాడు. మత్తులో ఆత్మహత్య చేసుకుంటానంటూ సముద్ర లోతుల్లోకి వెళ్లిపోయాడు. దీన్ని గుర్తించిన గజ ఈతగాళ్లు అతన్ని పట్టుకొని ఒడ్డుకు చేర్చారు. వివరాలు ఆరా తీయగా శ్రీకాకుళం జిల్లా రేగడి ఆమదాలవలసకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. చేతిలో డబ్బులు ఏమీ లేకపోవడంతో పోలీసులు డబ్బులు ఇచ్చి బస్సు ఎక్కించి పంపించారు.

మొదటి పేజీ తరువాయి

## ఎన్నికలు ఎప్పుడు జరిగినా మేం సిద్ధం

ఉన్నపుడు ఎన్నికలు ఎలా పెడతారు. అసలు ఎన్నికల నిర్వహణకు ప్రాతిపదిక ఏమిటి?. ఒక పక్క చీఫ్ సెక్రటరీ ఎన్నికలు నిర్వహించలేము అని అంటుంటే.. రమేష్ కుమార్ గారికి తొందరెందుకు .కోవిడ్ అంతా తగ్గిన తర్వాత ఎన్నికలు జరగాలని మేము ప్రభుత్వం తరపున భావిస్తున్నాం. ఆ రోజే ఎన్నికలు పూర్తి చేసి ఉంటే సరిపోయేది. వాయిదా వెనుక ఉద్దేశాలు, నిమ్మగడ్డ వ్యవహార శైలీ ఆ తర్వాత మాకు అవగతం అయ్యింది. ఒక ప్రభుత్వంగా ప్రజలు, ఉద్యోగుల బాధ్యత మాపై ఉంది. ఒక రాజకీయ పార్టీని ఫ్యాక్షనిస్టు పార్టీ అని మాట్లాడిన వ్యక్తి నిష్పక్షపాతంగా ఉంటాడని మేము భావించడం లేద"ని పేర్కొన్నారు.

## విద్యుత్ ఉద్యోగుల విభజనపై సుప్రీంలో విచారణ

ఏపీ రిలీవ్ చేయడం సరైనదా కాదా అనేది నిర్ణయిస్తామని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. నేటి విచారణలో తెలంగాణ విద్యుత్ సంస్థల పిటిషన్లపై వాదనలు ముగిసిన నేపథ్యంలో ఏపీ విద్యుత్ సంస్థల వాదనలు కొనసాగాల్సి ఉంది. దీనిపై తదుపరి విచారణను ఈనెల 23వ తేదీకి వాయిదా వేసింది.

## భారత్‌తో కలిసి పనిచేసేందుకు ఎదురుచూస్తున్నా

ఈ సందర్భంగా బైడెన్‌తో మోదీ అన్నారు. ఇందుకు ప్రధాని మోదీకి బైడెన్ కృతజ్ఞతలు తెలిపారు. బరాక్ ఒబామా హయాంలో బైడెన్ అమెరికా ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. విదేశాంగ వ్యవహారాల్లో కీలక సంస్కరణలు తీసుకొచ్చారు. నాటి నుంచే మోదీ, బైడెన్ మధ్య మంచి అనుబంధం ఉంది. బైడెన్ అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న నేపథ్యంలో భారత్-అమెరికా సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు.

1970లో సెనేటర్‌గా ఉన్నప్పటి నుంచి బైడెన్.. భారత్-యూఎస్ సంబంధాల బలమైన ప్రతిపాదకుడిగా గుర్తింపు పొందారు. 2008లో ద్వైపాక్షిక పౌర అణు ఒప్పందానికి సెనేట్‌ఆమోదం పొందడంలో కీలక పాత్ర పోషించారు. తాజాగా ఇరువురు నేతల సంభాషణ సందర్భంగా బైడెన్, కమలా హారిస్‌కు శుభాకాంక్షలు తెలిపినట్లు మోదీ ట్వీట్చేశారు. భారత్-అమెరికా వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు ఇరువురు నేతలు కట్టుబడి ఉన్నట్టు ఆయన పేర్కొన్నారు.

## డిసెంబర్ 25న రాష్ట్రవ్యాప్తంగా ఇళ్ల స్థలాల పంపిణీ కార్యక్రమం

పేర్కొన్నారు. "గతంలో పెద్ద పారిశ్రామిక వేత్తలకు ఎకరాలకు ఎకరాలు కట్టబెట్టారు. కానీ ఇప్పుడు పేదలకు ఇప్పుడు సెంటు, సెంటున్నర స్థలం ఇస్తామంటే అడ్డుకుంటున్నారు. ఈ యుద్ధంలో గెలుస్తాం. దేవుడు మనకు అండగా ఉంటాడు. ఇది చాలా గొప్ప కార్యక్రమం. ఇళ్ల స్థలాల కోసం 66,518 ఎకరాలు సేకరించాం. వాటి మార్కెట్ విలువ రూ.23 వేల కోట్లు. మొత్తం 30,68,821 మంది పేదలకు పంచబోతున్నాం"అని ముఖ్యమంత్రి సంతోషం వ్యక్తం చేశారు.

"ఇక కొత్త దరఖాస్తుల నేపథ్యంలో 80 వేల మందికి కొత్తగా భూసేకరణ చేయాల్సి ఉంది. కాబట్టి వేగంగా ఆ పని చేయండి. డిసెంబరు 10వ తేదీ లోగా భూసేకరణతో పాటు, ప్లాట్ల గుర్తింపు 100 శాతం పూర్తి కావాలి. అర్హులైన లబ్ధిదారులు ఇంకా ఎక్కడైనా మిగిలిపోతే, వారినీ కొత్తవారి జాబితాలో చేర్చాలి. వచ్చే నెల 25న ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే నాటికి ఇంటి నిర్మాణాలకు సంబంధించిన లబ్ధిదారుల జియో ట్యాగింగ్ పూర్తి కావాలి. పథకాన్ని అమలు చేసేందుకు ఆరోజు నాటికి కలెక్టర్లు సిద్ధంగా ఉండాలి. కోర్టు స్టేలు ఉన్నచోట ఆ స్టేలను వెకేట్ చేయించుకునేలా కలెక్టర్లు గట్టి ప్రయత్నం చేయాలి" అని సీఎం జగన్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

1). ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీకి ఏర్పాట్లు. పక్కా ఇళ్ల నిర్మాణం:

పథకంలో ఇప్పటి వరకు 30,68,281 మంది లబ్ధిదారులను గుర్తించాం.

అధికారంలోకి వచ్చిన మూడు నెలల నుంచే ఈ కార్యక్రమం మొదలు పెట్టాం.

గిట్టని వాళ్లు కోర్టులకు వెళ్లారు, పేదలకు ఇంటి స్థలం ఇవ్వకుండా రాజకీయం చేస్తున్నారు.

**టిడ్కో ఇళ్లు-ఇళ్ల నిర్మాణం:**

టిడ్కో ద్వారా రాష్ట్రంలో 2,62,216 ఇళ్ల నిర్మాణం.

వాటిలో ఇప్పటికే 1,43,600 ఇళ్లు నిర్మాణంలో ఉన్నాయి. వాటిని 300 చదురపు అడుగుల్లో నిర్మిస్తున్నాం ఇంకా 365 చదరపు అడుగుల్లో 44,300 ఇళ్లు, 430 చదరపు అడుగుల్లో 74,300 ఇళ్ల నిర్మాణం జరుగుతోంది.

గత ప్రభుత్వ బకాయిలు:

టిడ్కోకు సంబంధించి గత ప్రభుత్వం రూ.3200 కోట్లు బకాయి పెట్టి పోయింది.

ఒక వైపు ఆ బకాయిలు తీరుస్తూనే, మన ప్రభుత్వం వచ్చాక ప్రజల కోసం ఇప్పటికే రూ.1200 కోట్లు ఇచ్చాం. ఈ వారంలో మరో రూ.400 కోట్లు, ఇంకో రూ.600 కోట్లు 15 రోజుల్లో ఇస్తాం.

**మూడేళ్ల పాటు ప్రాజెక్టు:**

రూ.2500 కోట్లు టిడ్కో ఇళ్ల మౌలిక వసతుల కోసం ఖర్చు, ఆ మేరకు టెండర్లు పిలవబోతున్నాం. డిసెంబరు 15 నాటికి ఆ టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలి. ఈ ప్రాజెక్టును పూర్తి చేయడం కోసం ప్రభుత్వం చేయబోయే వ్యయం రూ.9550 కోట్లు. అందుకే ఈ ఏడాది, వచ్చే ఏడాది, ఆ తర్వాత ఏడాది కూడా పనులు చేపట్టి పూర్తి చేస్తాం.

వలంటీర్లు వచ్చే సోమవారం (23వ తేదీ) నుంచి ఈనెల 30వ తేదీ వరకు టిడ్కో లబ్ధిదారుల్లో 300 చదరపు అడుగుల ఇల్లు పొందుతున్న వారి దగ్గరకు ప్రభుత్వ లెటర్ తీసుకుని పోతారు. మీకు బాబు ముద్దా? జగన్ ముద్దా? అని అడుగుతారు. మీకు బాబు స్కీమ్ కావాలా? జగన్ స్కీమ్ కావాలా? అని కూడా అడుగుతారు.అందులో బాబు స్కీమ్‌లో ఏముంటుంది? జగన్ స్కీమ్‌లో ఏముంటుంది? అన్నది స్పష్టంగా రాయండి.

బాబు స్కీమ్:

లబ్ధిదారుడు రూ.3 లక్షల అప్పును నెలకు రూ.3 వేల చొప్పున 20 ఏళ్ల పాటు వడ్డీతో సహా మొత్తం రూ.7 లక్షలు కట్టాలి. ఆ తర్వాతే ఇంటిపై హక్కులు వారి చేతికి వస్తాయి. అప్పుడే ఆ ఇంటి పట్టా వారికందుతుంది.

జగన్ స్కీమ్:

కేవలం ఒక్క రూపాయితో వెంటనే అగ్రిమెంట్ ఆఫ్ సేల్, ఏ అప్పు లేకుండా ఇప్పుడే సర్వ హక్కులతో ఇల్లు.

తర్వాత పక్కాగా ఫ్రీ రిజిస్ట్రేషన్.

ఈ వివరాలు చెప్పి, వారికి ఏ స్కీమ్ కావాలన్నది తెలుసుకోండి.

1 రూపాయికే అగ్రిమెంట్ ఆఫ్ సేల్: డిసెంబరు 25న, 300 చదరపు అడుగుల టిడ్కో ఇళ్లను లబ్ధిదారులకు కేవలం ఒక్క రూపాయితో అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేస్తాం. పేదలకు హక్కుగా ఇచ్చిన ఇళ్లను బలవంతంగా స్వాధీనం చేసుకోవడం ఎందుకు? చంద్రబాబు ఏం మాట్లాడుతున్నాడో ప్రజలకు కూడా అర్థం కావడం లేదు. జగన్ స్కీమ్ కావాలనుకున్న వారికి కూడా డిసెంబరు 25న కేవలం ఒక్క రూపాయితో అగ్రిమెంట్ ఆఫ్ సేల్.

ఆ ఇళ్లకూ చంద్రబాబు బకాయిలు:

గ్రామీణ ఇళ్లకు సంబంధించి చంద్రబాబు వదిలి పెట్టి పోయిన బకాయిలు రూ.1432 కోట్లు. అందులో ఈ వారంలో సుమారు రూ.470 కోట్లు విడుదల చేయబోతున్నాం.

ఆ తర్వాత మిగిలిన రూ.962 కోట్లు వచ్చే డిసెంబరు 25న బటన్ నొక్కి విడుదల చేస్తాం.

కొత్త ఇళ్ల నిర్మాణం:

నవరత్నాలులో చెప్పిన మరో కార్యక్రమం అమలు చేయబోతున్నాం

తొలి దశలో దాదాపు 15.10 లక్షల ఇళ్ల నిర్మాణం.

ఒక్కో ఇంటిని రూ.1.80 లక్షల వ్యయంతో, అన్నీ ఒకే మాదిరిగా నిర్మిస్తారు.

ఒక్క రూపాయి కూడా పేదలపై భారం పడదు.

ఇంటి నిర్మాణానికి అవసరమైన పూర్తి సామాగ్రి సెంట్రల్ ప్రొక్యూర్‌మెంట్ ద్వారా సరఫరా. నాణ్యతకు అత్యధిక ప్రాధాన్యం.

క్వాలిటీ అనేది ప్రభుత్వానికి ట్రేడ్ మార్క్. బ్రాండ్ ఇమేజ్.కాబట్టి ఎక్కడా రాజీ పడొద్దు.

పేదల ఇళ్ల నిర్మాణానికి ఇసుక ఉచితంగా సరఫరా చేస్తారు.

67.50 లక్షల టన్నుల సిమెంట్, 7.20 లక్షల టన్నుల ఇనుము అవసరం అవుతుంది.

ఈ ఇళ్ల నిర్మాణం వల్ల 21 కోట్ల పని దినాలు లభించనున్నాయి.

ఆ విధంగా దగ్గరుండి పేదలకు ఇళ్లు కట్టించి ఇస్తాం.

మెటీరియల్ ఇ స్తాం. లేబర్ కాంపొనెంట్ వారికే ఇస్తాం.

సచివాలయాల పాత్ర:

ఇళ్ల నిర్మాణంలో గ్రామ, వార్డు సచివాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి.

డిజిటల్ అసిస్టెంట్, వెల్ఫేర్ అసిస్టెంట్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో పాటు, వలంటీర్లు కూడా పని చేస్తారు.

లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలు ప్రారంభించడం మొదలు, వారికి అవసరమైన అన్ని పనులు చేస్తారు.

జిల్లా స్థాయిలో జాయింట్ కలెక్టర్ (అభివృద్ధి) ఆ బ్యాధ్యత చూస్తారు.

ఇంజనీరింగ్ అసిస్టెంట్లు క్వాలిఫైడ్. వారి సేవలు ఉపయోగించుకోండి. అందుకు తగిన ఎస్ఓపీ ఖరారు చేయండి.

### 'ఓపెన్ యాంథమ్'తో

# గీతం గ్రంథాలయం అనుసంధానం

## ఇంటి నుంచే గ్రంథ పఠనంకు అవకాశం

సాగర్‌నగర్ : కరోనా కారణంగా ఇంటివద్దనే ఉంటూ ఆన్ లైన్ లో తరగతులకు హజరవు తున్న విద్యార్థులకు, పరిశోధకులకు, అధ్యాప కులకు విలువైన గ్రంథాలను ఇంటి నుంచే చదువుకునే అరుదైన అవకాశాన్ని కల్పిస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం నిర్ణయం తీసుకుంది. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో గీతం వైస్ ఛాన్సలర్ ఈ విషయాన్ని ప్రకటించారు. ప్రపంచంలోని ప్రముఖ విశ్వవిద్యాలయాలు అనుసరిస్తున్న ఓపెన్ యాంథమ్ విధానాన్ని గీతం ఇకపై అందుబాటులోకి తెస్తోందన్నారు. గీతం అధ్యాపకులు. పరిశోధకులు, విద్యార్థులు తమ అధికారిక మైల్ తో ఇంటినుంచి అంతర్జాతీయ జర్నల్స్ సహితం పరిశీలించుకునే అవకాశం కల్పిస్తున్నామని వెల్లడించారు. మ్మొబైల్ ద్వారా కూడా గ్రంథ పరిశీలన సాధ్యపడుతుందని తెలిపారు. కాగా ఇండియన్ సైటేషన్ ఇండెక్స్, నేషనల్ డిజిటల్ లైబ్రరీ ఆఫ్ ఇండియా, సౌత్ ఏసియా ఆర్కివ్, స్ప్రింగర్ లింక్, ఎసిఎమ్ డిజిటల్ లైబ్రరీ, ఎఎస్ఎమ్ఇ డిజిటల్ కలెక్షన్, ఐఇఇఇ ఎక్స్ ప్లోర్, అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీరింగ్ వంటివి అందుబాటులో ఉంచ నున్నారు. ఒకే విడత 30 వేల మందికి పైగా చదువరులు ఈ గ్రంథాలను పరిశీలించినా ఏ సమస్య తలఎత్తకుండా సాంకేతిక ఏర్పాట్లు చేసినట్లు గీతం సెంటర్ ఫర్ అడ్వాన్స్ టెక్నాలజీ సొల్యూషన్స్ (క్యాట్స్) విభాగం ఏర్పాట్లు చేసిందని చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గోపాలకృష్ణ తెలిపారు. త్వరలో మరిన్ని సధుపాయాలను అందుబాటులోకి తెచ్చే ప్రయత్నంలో ఉన్నా మన్నారు. జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో ప్రస్తుత కోవిడ్ పరిస్థితులకు తగిన విధంగా ఓపెన్ యాంథమ్ అందుబాటులోకి తేవడం పట్ల రిజిస్టార్ ప్రొఫెసర్ డి. గుణశేఖరన్ గీతం సాంకేతిక బృందాన్ని అభినందించారు.

### లక్కవరం లో ఉత్సాహంగా

# ఎడ్లబండి పరుగు పోటీలు

లక్కవరం లో ఎడ్లబండి పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

చోడవరం : నాగుల చవితి పండుగ సంద ర్భంగా మండలంలోని లక్కవరం గ్రామంలో ఎడ్లబండి పరుగు పోటీలను ఉత్సా హంగా నిర్వహించారు. బుధవారం సాయంత్రం జరిగిన ఈ పోటీల్లో వివిధ గ్రామాలకు చెందిన వారు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఎడ్లబండి పోటీల్లో గెలుపొందిన విజేతలకు 8 వేలు, 6 వేలు, 5 వేలు, 4 వేలు, 3 వేలు, 2 వేలు నగదు బహుమతులను కమిటీ వారిచే అందజేశారు.

చీడికాడ గ్రామంలో బుధవారం నాగులచవితిని పురస్క రించుకుని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి బొడ్డు శ్రీనివాస్ వారి కుటుంబ సభ్యులతో కలిసి పుట్టలో పాలు పోసి అందరితో కలిసి ముచ్చటించారు.

### కర్రి అప్పలస్వామి ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో

# స్వరూపానంద సరస్వతి మహాస్వామి జన్మదిన వేడుకలు

సింహాచలం : విశాఖ శారదా పీఠాధిపతులు స్వరూపానంద సరస్వతి మహాస్వామి వారి జన్మదినోత్సవం సందర్భంగా శ్రీ స్వామి వారి ఆదేశాల మేరకు మానవ సేవే మాధవ సేవగా తలచి బుధవారం కర్రి అప్పలస్వామిచారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు కర్రి అప్పలస్వామి స్థానిక శ్రీ శ్రీనివాస కళ్యాణ మండపంలో 100 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో...

అడవివరం సహకార పరపతి సంఘం పాలకవర్గ సభ్యులు కొలుసు గురునాధరావు, లోగిస గణేష్, మునసు నూకరాజు, యనపు వరాహ నరసింహం, కంపర గణేష్ మొదలగు వారు పాల్గొన్నారు.

# గజపతినగరం, అంబేరుపురం గ్రామాలలో ఘనంగా మేడ ఉత్సవం

చోడవరం : మండలం లోని గజపతినగరం, అంబే రు పురం గ్రామాలలో మేడ ఉత్సవం కార్యక్రమాన్ని సాయంత్రం ఘనంగా నిర్వ హించారు. నాగుల చవితి సందర్భంగా ఈ రెండు గ్రామాల్లో కోలాటాలు, వివిధ సాంస్కృతిక కార్య క్రమాలతో గౌరీ పార్వతి దేవి అమ్మవారి మేడ ఉత్సవాన్ని నిర్వహిం చారు. ఈ కార్య క్రమంలో ఆయా గ్రామా లకు చెందిన గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

గజపతినగరంలో కోలాటాలు ప్రదర్శన నిర్వహిస్తున్న మహిళలు

# భక్తి శ్రద్ధలతో నాగులచవితి

## గ్రామాలలో వెల్లివెరిసిన భక్తిభావం

అచ్యుతాపురం : మండలంలో పలు గ్రామాలలో బుధవారం ప్రజలు నాగుల చవితి పండగను భక్తి శ్రద్ధలతో జరుపు కున్నారు. తెల్లవారు జామునే ప్రజలు పుట్ట వద్దకు చేరుకుని చుట్టూ ఉన్న తుప్పలు తొలగించి పుట్టలోని నాగేంద్రునికి అర్పించే పాలు, చిమిటి, గ్రుడ్లు, నాగరుమాలుతో పాటు బాణ సంచా సామాగ్రిని తీసుకెళ్లి పూజలు నిర్వహించారు. కొన్ని గ్రామాలలో రాగులు, పెసలు తో మొలకెత్తిన మొక్కలతో (జూజాలు) బుట్ట లను పుట్ట దగ్గరకు తీసుకువెళ్తారు.

తమకు ఎటువంటి ఆపద తల పెట్ట కుండా చూడాలంటూ భక్తులు నాగేంద్రునిని వేడుకున్నారు.

అనంతరం ప్రసాదాన్ని కుటుంబ సభ్యులతో పాటు అందరికి పంచిపెట్టి భక్తిభావం చాటుకున్నారు. అచ్యుతాపురంలో హెరిటేజ్ డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు కుటుంబ సభ్యులతో కలిసి తమ పొలంలో పుట్ట వద్ద నాగేంద్రునికి పూజలు నిర్వహించారు.

### భక్తిశ్రద్ధలతో

# నాగులచవితి పూజలు

గాజువాక : భక్తులు భక్తిశ్రద్ధలతో నాగులచవితి పూజలు వైభవంగా జరుపుకున్నారు. ఆవాసాలుగా ఉన్న పుట్టలకు పూజలు నిర్వహించారు. బుధవారం ఎవ్వరికి వారు వారివారి పుట్టలకు కుటుంబాలతో చేరుకొని పూజలు చేసుకున్నారు. నగరశివారు ప్రాంతాలైన కూర్మన్నపాలెం, అగనంపూడి, స్టీలు ప్లాంట్ వంటి ప్రాంతాలు తెల్లవారు జామునుంచి పుట్టలవద్దకు భక్తులు చేరుకొని నాగదేవతకు ప్రత్యేక పూజలు చేశారు. పుట్టలను వెతికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. పాలు, పండ్లు, పూలతో చిమ్మిలి గుడ్డును సమ ర్పించి నాగులను వేడుకున్నారు. శివుని కంఠాభరణం, విష్ణుమూర్తి శేషపాన్పుగా ఆది శేషుడు రూపాల్లో గుర్తు చేసుకుంటూ పూజలు నిర్వహించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పలనాగిరెడ్డి కుటుంబ సమేతంగా వెంకన్నపాలెంలో పుట్టలకు పూజలు నిర్వహించారు. వైకాపా నేతలు దేవన్ రెడ్డి, వంశీరెడ్డిలు పూజలు నిర్వహించారు. కాగా, బుధవారం విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్రస్వామి నాగుల చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గాజువాకలో ప్రజలు ఆయనకు జన్మదిన శు భాకాంక్షలను తెలిపారు.

## మైదానంలో మంచు ముసురు

మాకవరపాలెం : మంచు మైదానాన్ని కమ్మేస్తోంది. రెండు రోజుల నుంచి చలి తీవ్రత అధికంగా ఉంది.

రాత్రి నుంచి మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8 గంటలైనా మంచు తెరలు వీడకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వాహన చోదకులు లైట్ల సాయంతో రాకపోకలు సాగిస్తున్నారు.

# పేదలకు సేవలు అందించడంతోనే అత్మసంతృప్తి

## - నిరుపేదలకు అన్నదానం వస్త్రదానం - ఘనంగా శివతేజ జయంతి వేడుకలు

ఎంతో మందికి వారికి తొచిన రీతిలో సహాయం చేస్తున్నట్టు చెప్పారు. నగరంలోని ప్రేమసమాజంతో పాటు అనేక అశ్రమాలకు శివతేజ తండ్రి పైల దివాకర్ రావు విరాళాలు అందిస్తున్న తీరు అభినందనీయమన్నారు. తాజాగా శివతేజ జయంతిని పురస్కరించుకొని వివేకానంద వృద్ధాశ్రమంలో అతిధుల చేతులమీదుగా అన్నదానం, వస్త్రదానం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. చలికాలం నేపధ్యంలో వృద్ధులకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ ఫౌండర్ పైల దివాకర్, రమణీ, వివేకానంద సంస్థ అధ్యక్షుడు సూరాడ అప్పారావు, ఇరోతి ఈశ్వరరావు , పీతల మూర్తి యాదవ్‌తో పాటు పలువురు పాల్గొనితమ వంతు సేవలు అందించారు.

**నిరుపేదలకు అల్పాహారం పంపిణీ** : బుధవారం ఉదయం శివతేజ ఫౌండేషన్ ఆధ్వర్యంలో న్యూకాలనీ సాయిబాబా ఆలయం నుంచి రైల్వే సేనటషన్ వరకు అన్నార్థులకు అల్పాహారంను దివాకర్ కుటుంబ సభ్యులు చేతులమీదుగా పంపిణీ చేశారు.

విశాఖపట్నం : నిరుపేదలకు వారు కోరుకున్న విధంగా సేవలు అందించడంతోనే పూర్తిస్థాయిలో ఆత్మసంతృప్తి కలుగుతుందని రాష్ట్ర బిసీ కమిషన్ సభ్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పక్కి దివాకర్ అన్నారు. బుధవారం ఇక్కడ వివేకానంద అనాధ వృద్ధాశ్రమంలో పైల శివతేజ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శివతేజ జయంతి వేడుకలను వారి కుటుంబ సభ్యులు సన్నిహితులు తదితర్లు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో పక్కి దివాకర్ మాట్లడుతూ నిరుపేదల కోసం వివేకానంద సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమన్నారు. కోవిడ్ లో సైతం ఈ సంస్థ ఎనలేని విధంగా సేవలందించింది అని కొనియాడారు. కార్యక్రమ నిర్వహకులు జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ,వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ ప్రతి ఏటా శివ తేజ జయంతి వేడుకలను చారిటబల్ ట్రస్ట్ ద్వారా వారి కుటుంబ సభ్యులు అత్యంత ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. శివతేజ జయంతి, వర్ధంతి సందర్భంగా నగరంలోని అనేక వృద్ధాశ్రమాలలో వారి కుటుంబ సభ్యులు సేవలందిస్తున్నారని

దొండపర్తి కుమ్మరి వీధి కోసూరు సత్యం ఈ నెల 05-11-2020 మరణించారు. రేపు పెద్దకర్మ కారణంచేత వార్డు అధ్యక్షులు మరియు కార్పోరేటర్ అభ్యర్థి నీలాపు సర్వేశ్వర రెడ్డి బుధవారం రూ. 5000/- ఆర్థిక సహాయం చేశారు.

## పింఛన్ ఇవ్వలేదని వాలంటీర్‌పై ఫిర్యాదు

గొలుగొండ : మండల కేంద్రం శ్రీరామపురం గ్రామానికి చెందిన లగుడు లక్ష్మీ, బి.రమణమ్మ వితంతు పింఛన్లు రెండు నెలల నుండి గ్రామానికి చెందిన వాలంటీర్ రాజాన తరుణ్ డబ్బులు చేయలేదని కారణంతో గ్రామ సచివాలయం సిబ్బందికి ఫిర్యాదులు చేశారు. అక్టోబర్, నవంబర్ నెలలకు సంబంధించి పింఛన్లు మంజూరు కాలేదని వేలిముద్రలు వేస్తేనే పింఛన్లు తర్వాత వస్తాయని తెలిపి పింఛన్లు ఇవ్వడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. వాలంటీర్‌పై మండల, పంచాయతీ అధికారులు చర్యలు తీసుకొని రెండు నెలల పింఛన్లు డబ్బులు ఇప్పించాలని కోరారు.

# విజయభాను సంపాదకీయం

## బల్దియా భేరి

బల్దియాలో ఎన్నికల నగారా మోగింది. హైదరాబాద్ మహానగర మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ విడుదల చేసింది. 14 రోజుల్లో ఎన్నికల ప్రక్రియను ముగించేవిధంగా షెడ్యూల్‌ను ఖరారు చేసింది. డిసెంబర్ ఒకటిన పోలింగ్, నాలుగున కౌంటింగ్‌తో జీహెచ్ఎంసీ ఎన్నికలు ముగియనున్నాయి. దీంతో నగరంలోని 150 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. గత కొంత కాలంగా జీహెచ్ఎంసీ ఎన్నికలపై జరుగుతున్న ఊహాగానాలకు తెరదించుతూ ఎన్నికల ప్రకటన రావటంతో రాజకీయపార్టీల్లో ఉరుకులు పరుగులు మొదలయ్యాయి. ప్రధాన పార్టీలు అస్త్ర,శస్త్రాలకు పదును పెడుతున్నాయి. రాష్ట్రంలో ఏర్పడిన తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో జీహెచ్ఎంసీ ఎన్నికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఎన్నికలు అనగానే రాజకీయపార్టీలు తమవైన విధానాలతో, అభివృద్ధి ప్రణాళికలతో ప్రజల ముందుకు పోవటం సహజం. కానీ జీహెచ్ఎంసీ ఎన్నికల క్రమంలో రాష్ట్రంలోని విపక్ష పార్టీల తీరు పరమ వికృతంగా ఉన్నది. ఇన్నాళ్లూ తెలంగాణ అభివృద్ధి, ప్రజాసామరస్యం, సుస్థిర పాలన అంటే గిట్టని, ఈర్ష్యాద్వేషాలతో రగిలిపోతున్న శక్తులు కలుగుల్లోంచి బయటకు వస్తున్నాయి. ఒకరు కులం కార్డు బయటకు తీస్తే, మరొకరు మతం రంగుపూసుకొని సహజీవన సంస్కృతిలో చిచ్చు రేపేందుకు కుట్రలు పన్నుతున్నారు. నగరప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు కాలు కదుపుతున్నారు. స్వీయపాలనా అనుభూతితో ఆత్మగౌరవంతో ఐకమత్యంగా ఉన్న ప్రజలను రకరకాల పేర్లతో విచ్ఛిన్నం చేయటమే లక్ష్యంగా పావులు కదుపుతున్నారు. సుదీర్ఘ పోరాటాలతో అనన్య త్యాగాలతో రాష్ట్రాన్ని సాధించుకున్న తెలంగాణ ప్రజలు రాయంచలా పాలను, నీళ్లను వేరు చేసి, విద్వేష రాజకీయాలకు పాతరేయటం ఖాయం.

ఆవిర్భావం తర్వాత రెండోసారి జరుగుతున్న జీహెచ్ఎంసీ ఎన్నికలకు ప్రాధాన్యమున్నది. పోరాడి సాధించుకున్న తెలంగాణలో ఆత్మగౌరవ స్వీయపాలనా విధానాలు, అభివృద్ధి సంక్షేమ పథకాలకూబీ అబద్ధాల పునాదులపై విద్వేష రాజకీయాలకు మధ్యన పోరు జరుగుతున్నది. ఈ ఐదేండ్ల పాలనలో అమలైన అభివృద్ధి సంక్షేమ పథకాలు రాష్ట్రాన్ని అన్నింటా ఆదర్శంగా నిలిపాయి. ప్రజల జీవన ప్రమాణాలు గణనీయంగా పెరిగాయి. గతంలో ముఠా, మతవిద్వేష రాజకీయాల కారణంగా మతకలహాలకు నెలవైన రాజధాని ప్రస్తుతం బ్రాండ్ హైదరాబాద్‌గా మారింది. ప్రపంచ దేశాల నుంచి బహుళజాతి కంపెనీలన్నీ భాగ్యనగరం వైపు చూస్తున్నాయి. వేల కోట్ల పెట్టుబడులతో క్యూ కడుతున్నాయి. ఇవాళ హైదరాబాద్ రాష్ట్ర రాజధాని మాత్రమే కాదు, ఓ విశ్వనగరం. సకల జాతి, మత, భాషా సంస్కృతుల సమ్మేళనం. గంగాజమున తెహజీబ్‌ను ఎత్తిపడుతూ అభివృద్ధి సంక్షేమ విధానాలకు హైదరాబాద్ ప్రజలు పెద్దపీట వేస్తారనటంలో సందేహం లేదు.

## కరోనా టీకాపై ఫైజర్ గుడ్‌న్యూస్!

కరోనా వ్యాక్సిన్ ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఆశతో ఎదురుచూస్తున్న ప్రజలకు అమెరికా ఫార్మా దిగ్గజ కంపెనీ ఫైజర్ గుడ్‌న్యూస్ చెప్పింది. కరోనా వ్యాధి సోకకుండా నిరోధించడంలో తమ కంపెనీ అభివృద్ధి చేసిన టీకా 95శాతం సమర్థత ప్రదర్శించినట్టు ప్రకటించింది. జర్మన్‌కు చెందిన బయాన్‌టెక్ ఎస్ఈతో కలిసి తయారుచేసిన ఈ టీకా ఎంతో సురక్షితమైనదని తెలిపింది. మూడో దశ క్లినికల్ ట్రయల్స్‌లో అన్ని వయస్సుల వారిలో దీని ప్రభావం స్థిరంగానే ఉందని, పెద్దగా దుష్ప్రభావాలు కూడా నమోదు కాలేదని వెల్లడించింది. కరోనా ముప్పు అధికంగా ఉండే 65 ఏళ్ల పైబడినవారిలో కూడా దీని సమర్థత 94శాతానికి పైగా ఉన్నట్టు తేలిందని తెలిపింది. త్వరలోనే యూఎస్ఎఫ్‌డీఏ అత్యవసర వినియోగ అనుమతికి దరఖాస్తు చేయనున్నట్టు తెలిపింది.

తమ సంస్థ అభివృద్ధి చేసిన వ్యాక్సిన్ 90శాతం ఫలితాలు ఇస్తున్నట్టు ప్రకటించిన వారంలోనే ఫైజర్ తాజా విశ్లేషణను బుధవారం వెల్లడించింది.

# నాగదేవతను పూజించడం మన సంప్రదాయం

అమరావతి: హిందూ ధర్మ ఔన్నత్యం... సనాతన ధర్మం పాటించడం మన పూర్వీకుల నుంచి మనం నేర్చుకున్నామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు తెలిపారు. మన తరువాయి తరాలకు హిందూ సంప్రదాయాలు, ఔన్నత్యాలను అందించాలన్నారు. నాగదేవతను పూజించడం మన హిందూ సంప్రదాయమన్నారు. నేడు నాగులచవితి సందర్భంగా నిమ్మాడలోని తమ స్వగ్రామంలో శివాలయాన్ని ఆనుకొని ఉన్న పుట్ట వద్ద నాగులచవితి పూజను సకుటుంబ సమేతంగా జరుపుకోవడం జరిగిందన్నారు. ప్రజలందరికీ అచ్చెన్నాయుడు నాగులచవితి శుభాకాంక్షలు తెలిపారు.

# శ్రీవారి సేవలో మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్ సింగ్

తిరుమల: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. కుటుంబ సమేతంగా తిరుమల వచ్చిన ఆయన ఇవాళ ఉదయం నైవేద్య విరామ సమయంలో శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీసర్చుకున్నారు. అనంతరం ఆలయంలోని రంగనాయకుల మండపంలో సీఎం దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం అందించారు. టీటీడీ అధికారులు వారికి స్వామివారి పట్టు వస్త్రాలను అందజేశారు. నాదనీరాజనం వేదికపై సుందరకాండ పఠనంలో ఆయన పాల్గొన్నారు. శ్రీవారి దర్శనం ఆనందాన్ని కలిగించిందని సీఎం శివరాజ్‌సింగ్ చెప్పారు. దేశం స్వయం సమృద్ధి సాధించాలని, కరోనా నుంచి దేశం విముక్తి పొందాలని శ్రీవారిని కోరుకున్నానని తెలిపారు. ప్రధాని మోదీ ఆత్మ నిర్భర్ భారత్ నినాదంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. ఆత్మనిర్భర్ మధ్యప్రదేశ్ దిశగా ప్రణాళికలు రచిస్తున్నామన్నారు.

# 'బంగారం పెట్టుకొని ఉద్యమం చేయకూడదా?'

## జనసేన అధినేత పవన్ కల్యాణ్

అమరావతి : అమరావతి ఉద్యమకారులపై వైకాపా నేతలు వ్యాఖ్యలు చేయడం సరికాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ అన్నారు. బంగారం పెట్టుకొని ఉద్యమం చేయకూడదా ఉద్యమం అంటే చిరిగిన బట్టలు వేసుకొనే ఉండాలాఅని పవన్ ప్రశ్నించారు. అమరావతి పరిరక్షణ సమితి నేతలతో పవన్ కల్యాణ్ సమావేశమయ్యారు. ఉద్యమానికి, సామాజిక వర్గానికి ముడిపెట్టడం సరికాదని అన్నారు. రాజధానిని మూడు ప్రాంతాల మధ్య సమస్యగా మార్చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అమరావతి రైతులకు తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని భరోసా కల్పించారు. రైతులకు న్యాయం చేసే విషయంలో ఎప్పటికీ వెనకడుగు వేసేదిలేదని పవన్ స్పష్టం చేశారు. "రాజధానిగా అమరావతే ఉంటుందని భాజపా నాకు స్పష్టం చేసింది. రాజదానిని తరలిస్తున్నట్లు ప్రభుత్వం అధికారికంగా చెప్పలేదు. అధికారికంగా ప్రకటించాక మా పార్టీ కార్యాచరణ చెబుతాం" అని పవన్ కల్యాణ్ తెలిపారు.

# వాలంటీర్‌గా హరియానా మంత్రి

## - 20 నుంచి మూడో దశ ప్రయోగాలు

చండీగఢ్: కరోనా వైరస్ నివారణకు ప్రముఖ ఫార్మా సంస్థ భారత్ బయోటెక్ అభివృద్ధి చేసిన కొవాగ్జిన్ మూడో దశ క్లినికల్ ప్రయోగాలు నవంబరు 20 నుంచి ప్రారంభం కానున్నాయి. కాగా ఈ ప్రయోగాల్లో భాగంగా హరియాణా ఆరోగ్య మంత్రి అనిల్ విజ్.. తొలి వాలంటీర్‌గా నమోదు చేసుకునేందుకు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. ఈ విషయాన్ని మంత్రి స్వయంగా ట్విటర్ వేదికగా వెల్లడించారు.

ఇప్పటికే మొదటి రెండు దశల ట్రయల్స్‌ను భారత్ బయోటెక్ విజయవంతంగా పూర్తిచేసిన విషయం తెలిసిందే. దీంతో మూడో దశకు డ్రగ్ కంట్రోల్ జనరల్ ఆఫ్ ఇండియా (డీసీజీఐ) అనుమతులు ఇచ్చింది. ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 25 కేంద్రాల్లో 26 వేల మంది వాలంటీర్లతో మూడో దశ క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడానికి భారత్ బయోటెక్ సన్నాహాలు చేపట్టింది. ఈ నెల 20 నుంచి ఈ ప్రయోగాలు ప్రారంభం కానున్నాయి. ఐసీఎంఆర్ భాగస్వామ్యంతో ఈ ప్రయోగాలు చేపట్టనుంది. కరోనా వైరస్ వ్యాక్సిన్ కోసం భారత్‌లో చేపడుతున్న అతిపెద్ద క్లినికల్ ట్రయల్ ఇదే.

ట్రయల్స్‌లో భాగంగా వాలంటీర్లకు 28 రోజుల తేడాతో రెండు ఇంట్రామస్కులర్ ఇంజెక్షన్లు ఇస్తారు. తొలి రెండు దశల్లో ఇప్పటివరకు టీకా తీసుకున్న వాలంటీర్లలో ఎలాంటి అనారోగ్య సమస్యలూ లేవని, అందరి ఆరోగ్యం నిలకడగా ఉందని భారత్ బయోటెక్ గతంలో తెలిపింది.

## సమయం

# విజయ రహస్యం

కాలం, ఖర్మం కలిసి రాలేదంటూ
జాతక చక్రం అనుకూలంగా లేదంటూ
జీవితంలో ప్రగతి సాధించలేకపోవుటకు
నెపాన్ని ఇతరులపై నెట్టేసి
నిమ్మకు నీరెత్తినట్లు హాయిగా
కూర్చునే వారు అధమాధములు
విజయం సాధించుటకు
తగిన మూల రహస్యం, సూత్రం
తమలోనే వున్నదని గ్రహించి
పట్టుదల, దీక్ష తపనలతో
క్రమబద్ధమైన ప్రణాళికతో
ధైర్యే సాహసే లక్ష్మీ అంటూ
ముందుకు సాగిన వారు ఉత్తములు
అనితర సాధ్యమైన విజయాలు వారికే స్వంతం

కవిత రచన :
సి.ప్రతాప్

# పంచాంగం

మాసం : కార్తీక; తిథి : పంచమి రా.2.36; పూషా.వ.2.40; రా.వ.10.33ల 12.08.

గురువారం 19-11-2020

**మేషం :** కుటుంబీకులతో కలిసి నూతన ప్రదేశాలను సందర్శిస్తారు. మిత్రుల, సహోదరుల సాయంతో మీ పనులు సులువుగా పూర్తి చేయ గలుగుతారు. వృత్తి కళా రంగాలలో మీ ప్రాధాన్యత అధికమవుతుంది. అనుకోని మార్పులు ఏర్పడ టంతో రోజువారీ మీ కార్యక్రమాలు సకాలంలో జరుగక అసహనం పెరుగుతుంది. హోటల్, క్యాటరింగ్ వ్యాపారులకు లాభం చేకూరుతుంది.ద్విచక్ర వాహనంపై దూర ప్రయాణాలు మంచిది కాదు. **వృషభం :** దీర్ఘకాలికంగా ఆగిపోయిన ధనం చేతికి వస్తుంది. లక్ష్య సాధనపై దృష్టి పెట్టడానికి సరైన సమయం. స్థిరాస్తుల అభివృద్ధి, కొనుగోలు యత్నాల విషయాలలో పునరాలోచన అవసరం. **మిథునం :** ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. వృత్తి, వ్యాపారాలు సజావుగా సాగుతాయి. దీర్ఘకాలిక రుణాలు తీరుస్తారు. బంధు మిత్రుల నుంచి విమర్శలు ఎదుర్కొంటారు. ఫైనాన్సు, చిట్‌ఫండ్ రంగాల వారికి ఖాతాదారుల నుంచి ఒత్తిడి, చికాకులు ఎదుర్కొంటారు. స్త్రీలు షాపింగ్ వ్యవహారాల్లో అపరిచిత వ్యక్తుల పట్ల మెళకువ అవసరం. **కర్కాటకం :** ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహకరంగా ఉంటాయి. రాజకీయ కళా రంగాల వారికి విదేశీ పర్యటనలు అనుకూలిస్తాయి. ప్రముఖుల కలయికతో ఒక వ్యవహారం సానుకూలం అవు తుంది. కాంట్రాక్టులు దక్కుతాయి. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. నిరుద్యోగులకు ఇంటర్వ్యూలలో మెళకువ అవసరం. ఖర్చులు అధిక మవుతాయి. **సింహం :**ఆత్మీయుల మధ్య కానుకలు పరస్పరం ఇచ్చి పుచ్చుకుంటారు. నూతన వ్యాపారాలలో గణనీయమైన పురోభివృద్ధి సాధిస్తారు. అవగాహన లేని విషయాలకు దూరంగా ఉంటే మంచిది. దంపతుల మధ్య కొత్తకొత్త విషయాలు చర్చకు వస్తాయి. ఖర్చులు అధికం అయినా ప్రయో జనకంగా ఉంటాయి. స్త్రీలకు పరిచయాలు, వ్యాపకాలు అధికమవుతాయి. **కన్య :** నిరుద్యోగులు ఇంట ర్వ్యూల్లో రాణిస్తారు. మీ శ్రమకు తగిన గుర్తింపు, ప్రతిఫలం లభిస్తాయి. మీ మాటకు ఇంటా బయటా ఆదరణ పెరుగు తుంది. చేపట్టిన పనుల్లో స్వల్ప ఆటం కాలు ఎదుర్కొంటారు. మీ వాహనం ఇతరులకిచ్చి ఇబ్బందు లెదుర్కొంటారు. **తుల :** నూతన పరిచయాలు, సంబంధ బాంధవ్యాలు మీ పురోభివృద్ధికి ఎంతగానో సహకరిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఆటంకాలను అధికమిస్తారు. స్త్రీలకు ఆరోగ్యంలో మెళకువ అవసరం. నిరుద్యోగులకు అశాజనకం. **వృశ్చికం :**స్త్రీలు పని దృష్ట్యా ఒత్తిడి, చికాకులకు ఎదుర్కొంటారు. ఏ విషయంపై అయినా స్పందించే ముందు పరిణామాలు ఎలా ఉంటాయో మరొక్కసారి ఆలోచించండి. చేతి వృత్తుల వారికి సదావకాశాలు లభిస్తాయి. ప్రేమికులకు పెద్దల నుంచి ప్రోత్సాహం, సన్ని హితుల సహకారం ఉంటాయి. నిరుద్యోగులు నిరాశ, నిస్పృహలకు లోన వుతారు. **ధనుస్సు :**ఆర్థిక వ్యవహారాలు, నూతన పెట్టుబడులకు సంబంధించి స్పష్టమైన నిర్ణయానికి వస్తారు. నిరుద్యోగులకు మధ్యవర్తుల పట్ల అప్రమత్తత అవసరం. స్త్రీలు, గృహోప కరణాలకు కావలసిన వస్తువులను కొనుగోలు చేస్తారు. దూర ప్రయాణాలలో కొత్త పరిచయాలు ఏర్పడతాయి. మీ మనసుకు ఊరట, ఉల్లాసం కలిగించే సంఘటనలు జరుగుతాయి. **మకరం :** మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మిత్రులకు పెద్ద మొత్తంలో ధన సహాయం చేసేటపుడు పునరాలోచన అవసరం. మనసులో భయాందోళనలూ అనుమానాలూ ఉన్నా, ధాంభికం ప్రదర్శించి పనులు సాఫీగా పూర్తి చేస్తారు. మీ అభిప్రాయాలకు తగిన వ్యక్తితో పరిచయాలేర్పడతాయి. స్వయంకృషితో వ్యాపారా లలో బాగా రాణిస్తారు. మీ సంతానంతో ఉల్లాసంగా గడుపుతారు. **కుంభం :** మీ వాగ్ధాటి, నిజాయితీలు ఎదుటివారిని ఆకట్టు కుంటాయి. స్త్రీల ఆరోగ్యంలో మెళకువ అవసరం. ఆత్మీయులకు విలువైన కాను కలు అంద జేస్తారు. ఉద్యోగస్తులు విశ్రాంతికై చేయు యత్నాలు అనుకూలిస్తాయి. **మీనం :** ఇంటా బయటా కూడా తలపెట్టుకున్న పనులకు ఆటంకాలు తప్పక పోవచ్చు. ప్రచార సాధనాలు, రవాణా రంగాల్లో మీ పెట్టుబడులు సత్ఫలితాల నిస్తాయి. విహార స్థలాలు, దేవాలయాలను సందర్శిస్తారు. స్థిరచరాస్తుల అభివృద్ధికి ప్రణాళికలు

# శ్రీరామదూత శిరసా: నమామి:

అంజనేయస్వామి చరిత్ర చదివిన వారికి బ్రహ్మ చర్య వ్రతపాలన, శీలరక్షణ, బలబుద్ధుల వికాసము శ్రీరామ చంద్రలవారియెడల భక్తి పూర్వకమైన దాస్య భావము మెదలైన మహత్తర గుణోపదేశము లభిస్తాయి. తనని ప్రార్థించిన భక్తులకు వెల్లప్పుడూ సంరక్షిస్తుంటాడు. ఆస్వామి ,భూత, ప్రేత రాక్షసాదులు ఆ స్వామినామాన్ని ఉచ్చరించినంత మాత్రమే పారిపోతాయి.

స్మరణ చేస్తేనే చాలు, అనారోగ్యం కుదుటపడుతుంది. మానసిక దౌర్భగ్య సంఘర్షణలో ఆస్వామి సహకారం లభిస్తుంది. ఆయనవల్ల తులసీదాసుకు రామదర్శనం లభిస్తుంది. ఆయన్ని ధ్యానిస్తే అలౌకికమైన సిద్దులు లభిస్తాయి. ఆ స్వామి బాలబ్రహ్మచారి ఆయన పరాక్రమం అమోఘం.

అందుకే శ్రీ రామచంద్రుడు హనుమంతుని యశస్సు గురించి చెబుతూ, "యుద్ధంలో ఆంజనేయుడు చూపించన పరాక్రమాన్ని యముడు ఇంద్రుడు కుబేరుడు ఇతర లోకపాలకులెవరూ చూపలేరు. అన్నాడు.శ్రీ రామచంద్రునికి గెలుపు లభించడం

లో హనుమంతుని వంటి నిష్కాను పరాక్రమవంతుడి పాత్ర ఎంతోవుంది. హనుమంతుడు ఒక్కడు జీవించేవుంటే చాలు మనసంతా లేకుంటేనేం శ్రీరాముడికి తప్పక జయం లభిస్తుంది. అని యుద్ధకాండలో అంటాడు. జాంబవంతుడు, ఆయనలో వుండే శ్రీరామభక్తి కారణంగానే ఆంజ నేయుని స్మరణ అమోఘమైన ఫలాన్ని సాధిస్తుంది.జీవితంలో సమస్యలెదురై క్లిష్టపరిస్థితిలో వున్నప్పుడు కార్యసాధనకై భక్తులు శ్రీరామసమేతుడైనా ఆ రామభక్తుని స్మరిస్తే చాలు, భక్తజనవ శంకరుడైన హనుమంతుడు వెంటనే వారి కోరికలు తీరుస్తాడు.శ్రీరామ నామాన్ని ఆంజ నేయుడు తన జీవిత సర్వస్వంగా భావించాడు. హనుమంతుడు నలుడు, నీలుడు మెదలైన వానర వీరులకు శ్రీరామనామాన్ని ఉపదేశిస్తూ "త్రాసు లోని ఒక పళ్లెంలో సమస్త మహా మంత్రా లను అనంత కోటి జ్ఞాన ధ్యాననాది సాధనా ఫలా లను ఉంచి, రెండవపళ్లెంలో కేవలం శ్రీ రామ నామాన్ని ఉంచితే చాలు అవన్ని కలిసినా సరి తూగవు" అంటాడు. శ్రీరామనామాన్ని జపించే వారిపట్ల ఆంజ నేయ స్వామి తప్పక ప్రసన్నుడై వుంటాడు. అటువంటి వారిపట్ల వారికి తనుకల్ప వృక్షమై సమస్త కోరిక లను తప్పక తీరు స్తాడు. "సమస్త రోగాములకు ఒకే ఒక దివ్యౌషధం కలదు. ఆదియే భగవ న్నామం" మనో నియంత్రణ ముఖ్యంఆధ్యాత్మిక అనేది ఎవరో అందిస్తే వచ్చేది కాదు.ఇతరులు ఎవరైనా ఒక మార్గం చూపగలరే గాని ఆ మార్గంలో గమ్యం చేరేందుకు మనబదులు నడవరు.

మన అడుగులతో మనం నవాల్సిందే.ఒకరి బదులుద మరొకరు పరీక్ష రాయడం నేరమని విద్యార్థులకు తెలుసు. అదే విధంగా ఒకరికిబదులు మరొకరు ధ్యానం చేసినా ఫలిత ముండదు. ఆధ్యాత్మిక చింతనకు ముఖ్యం కోరికల నుండి మనసును దూరం చేయడం అని పెద్దలు చెబుతారు. నిజమే, పదునుపోయిన కత్తి పండును కోసేందుకు పనికిరానట్టే, అనవసరపు ఆర్షణలకు అల్లుకుపోయిన మనసు మంచి వైపు మళ్ళలేదు.కోరికల భౌతిక సుఖాలు, ఆకర్షణల నుండి మెదుడును, మనసును దూరం చేసినప్పుడే అది ఆధ్యాత్మిక మార్గాన్ని గ్రహించ గలుగుతుంది. ఆలోచనలకు వేసిన మసకను తొలగించుకోవాలి. అలా తొలగించ గలగినదే మననకు తొలగించుకోవాలి. అలా తొలగించినదే ధ్యానం. ఆ ధ్యానంలో వున్న విశేషాన్ని తెలుసుకుంటే ఇక మిగిలిన ఆడ్డంకులన్నీ వాటంతట అవే తొలగిపోతాయి.

# గ్రామాభివృద్ధికి సహకరిస్తున్న లారస్ ల్యాబ్స్

## లారస్ ల్యాబ్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపిన పరవాడ మాజీ సర్పంచ్ చుక్కా

పరవాడ : పరవాడ ఫార్మా సిటీ లారస్ ల్యాబ్ ఫార్మా కంపెనీ యాజమాన్యం ఎంతో ఉదారతతో పరవాడ గ్రామానికి గడిచిన తన పదవి కాలం నుంచి నేటి వరకు కంపెనీ సి.ఎస్.ఆర్. నిధుల నుండి సుమారు 75 లక్షల రూపాయలు వెచ్చించి గ్రామ అభివృద్ధికి ఎంతగానో సహకరిస్తూ వారి ఉదారతను చాటుకుంటున్నారు అని పరవాడ మాజీసర్పంచ్ చుక్కరామునాయుడు అన్నారు. బుధవారము అయన స్థానిక విలేఖర్లుతో మాట్లడుతూ పరవాడ సంతబైల వద్ద వ్యాపారాలు చేసుకున్నవారంతా ఎండలో వానలో తడుస్తూ ఇబ్బందులు పడేవారు. వీరికి 35 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసి 120 వ్యాపార సముదాయాలను 5 భారీ షెడ్లలో అన్ని రకాలైన వ్యాపారాలు చేసుకునే విధంగా దుకాణాల సముదాయాన్ని నిర్మించారు అన్నారు.దీంతో వీరంతా ఈ దుకాణాల సముదాయాల్లో ఆనందంతో వ్యాపారాలు చేసుకుంటున్నారు.తరువాత పరవాడలో నూతనంగా నిర్మించిన మల్లిఖార్జున స్వామి ఆలయంలో ధ్వజస్థంభానికి సుమారు 4లక్షల రూపాయలు నిధులు వేచ్చించి నిర్మించి తమ సహాయంగా అందజేశారు అన్నారు.అలాగే కరోనా సమయంలో ప్రజలు పనులు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్న సమయంలో గ్రామ పెద్దల అభ్యర్థన మేరకు పరవాడ గ్రామస్తులందరికి 15 లక్షల రూపాయలు వ్యయంతో నిత్యావసర వస్తువులని పంపిణీ చేశారు అదే విధంగా పరవాడ నుండి లంకెలపాలెం వెళ్లే రోడ్డు గోతుకులుతో భారీగా ధ్వంసమైంది. ప్రయాణికులు, పరవాడ ప్రజలు ప్రమాదాలబారిన పడుతున్న సమయంలో స్థానిక నాయ కుల విన్నపం మేరకు ఈ రోడ్డు మరమ్మత్తుల కోసం తమ కంపెనీ సియస్ అర్ నిధులు నుంచి 20 లక్షల రూపాయలను లారస్ ల్యాబ్స్ మంజూరు చేశారుఅని అన్నారు. పరవాడ గ్రామంలో ఫార్మా వ్యర్థ జలాలు చెరువుల్లో చేరడంతో నీరు కాలుష్యం అవ్వడంతో పెద్ద సంఖ్యలో చేపలు మృతి చెందడంతో వాయు, నీటి కాలుష్యాల కారణంగా ఇబ్బంది పడ్డ ప్రజలు తీవ్ర ఆందోళనలు చేపట్టగా జవహర్ లాల్ నెహ్రూ ఫార్మా సిటీ బల్క్ డ్రగ్ అసోసియేషన్ స్పందించి పెద్ద చెరువు, ఊర చెరువు, సన్యాసి చెరువు రైతుల సమస్యలను పరిస్కార మార్గం దిశగా తీసుకువెళ్లడంలో లారస్ ల్యాబ్ ప్రతినిధులు ప్రత్యేక శ్రద్ద తీసుకుని రైతులకు, ప్రజలకు సరైన న్యాయం చేసే విధంగా చర్యలు తీసుకొన్నారు అని అన్నారు. పరవాడ గ్రామ అభివృద్ధికి సియస్ అర్ నిధులు మంజూరు అయ్యే విధంగా చొరవ చూపిస్తూ సహకరిస్తున్న లారస్ ల్యాబ్ హెచ్ అర్ విభాగం ఉపాద్యాక్షులు చావా నర్సింహా రావుకు మరియు కంపెనీ యాజ మాన్యంకు పరవాడ మాజీ సర్పంచ్ చుక్క రామునాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అలాగే గ్రామం తరపున కృతజ్ఞతలు తెలుపుతూ రానున్న రోజుల్లో మరింతగా గ్రామ అభివృద్ధికి, మరింతగా ప్రగతి బాటలో నడవడానికి అన్ని విధాలుగా సహకరిస్తారని ఆశిస్తున్నానని తెలిపారు.

# అల్లిగెడ్డ బ్రిడ్జి నిర్మించాలని ధర్నా

గెడ్డలో ధర్నా చేస్తున్న దృశ్యం

నాతవరం : నాతవరం మండలం వల్సంపేట పంచాయితీలో గల తాళ్లపాలెం నుండి వడపర్తి మధ్య అల్లిగెడ్డ బ్రిడ్జి నిర్మించి రెండు గ్రామాల మధ్య రెండు కిలోమీటర్ల రోడ్డును తక్షణమే పూర్తి చేయాలని సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అల్లిగెడ్డలో బుధ వారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం మండల కార్యదర్శి అడిగర్ల రాజు మాట్లాడుతూ ఈ రహదారి నర్సీపట్నం బైయపురెడ్డిపాలెం వంతెన నుండి గొలుగొండ, నాతవరం, కొయ్యూరు మండలాలను కలుపుకొని తూర్పుగోదావరి జిల్లాకి కలిసి ఉందన్నారు. ఈ మార్గాలపై మండలాల ప్రజలు నిత్యం రాకపోకలు చేస్తుంటారన్నారు. అత్యవసరాలకు నర్సీపట్నం వెళ్లేందుకు సులభతరమైన మార్గమన్నారు. కానీ ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన అల్లిగెడ్డ బ్రిడ్జి నిర్మాణం, రోడ్డు నిర్మాణం చేపట్టలేదన్నారు. వర్షా కాలంలో ఈ మార్గం నుండి వ్యవసాయ పొలాలకు, ఇతర అవసరాలకు ప్రపజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.

కావున ప్రభుత్వం వెంటనే అల్లిగెడ్డ బ్రిడ్జి, రోడ్డు నిర్మాణం చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఈరే ఎర్రన్న, రాజు, సూరిబాబు, వరహాలబాబు తదితరులు పాల్గొన్నారు.

# సంస్కృత నాట్యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిది

## అరకు ఎంపి గొడ్డేటి మాధవి

చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొయ్యూరు : సంస్కృత నాట్యాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అరకు ఎంపి గొడ్డేటి మాధవి అన్నారు. బుధవారం కొయ్యూరు మండలం ఎంపి స్వగ్రామమైన శరభన్న పాలెం గ్రామంలో కోలాటం నృత్య కళాకారులకు, థింసా నాట్యకులకు, జానపద గేయ కళాకారుల బృందాలకు సుమారు 50 చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ సంస్కృత నాట్యలను, జానపద గేయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందన్నారు. మన సంప్రదాయ నృత్యాలు నేటి తరానికి తెలియజేయాలని, కళాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో ఈ వస్త్ర పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపి భర్త శివప్రసాద్, సోదరుడు గొడ్డేటి మహేష్ పాల్గొన్నారు.

# యువత స్వయం కృషితో ఎదగాలి

గాజువాక : యువత స్వయం కృషితో ఎదగాలని, పారిశ్రామికవేత్తలుగా ఎదిగి మరో పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించాలని గాజువాక బీజేపీ కన్వీనర్ కర్రణంరెడ్డి నర్సింగరావు యువతకు సూచించారు. నియోజకవర్గ పరిధి చినగంట్యాడ హెడ్జిఎస్సి బిల్డింగ్ 5వ అంతస్తులో ఎంవి ఆర్ గ్రూప్ ఆఫ్ స్కూల్ స్కేల్ యూనిట్స్ అధినేత మొల్లేటి.వెంకటరావు నెలకొల్పిన ఉచిత శిక్షణ ఉపాధి కల్పన కుట్టుమిషను, ప్లంబింగ్ ,ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ నూతన తరగతుల గదులను ముఖ్య అతిథిగా పాల్గొన్న బీజేపి గాజువాక నియోజకవర్గ కన్వీనర్ డా.కరణంరెడ్డి నరసింగరావు ప్రారంభించారు. అనంతరం భవిష్య ఉపాధి కల్పనా మార్గ్ సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పి.ఎం. కె.వివై.ప్రధాన మంత్రి కౌసల్య వికాష్ యోజన పథకం ద్వారా దేశ యువతకు స్కిల్ డవలెప్మెంట్ ద్వారా వృత్తి శిక్షణ ఉపాధి అవకాశాలు కల్పించటమే ధ్యేయంగా 2022 నాటికి 20 కోట్ల మంది నిరు ద్యోగ యువతకు శిక్షణ ఇవ్వడానికి అన్నివిధాల సహకరిస్తున్నారని అన్నారు. 2016 నుండి 2020 నాటికి 60 లక్షల మంది యువతకు శిక్షణ యిచ్చారని చెప్పారు. కరోనా కష్ట కాలంలో ఆత్మ నిర్భర్ భారత్ ప్రత్యేక ప్యాకేజి ద్వారా ఎంఎస్ఎంఇ సూక్ష్మ, చిన్న, మధ్య తరగతి ఇండస్ట్రీ లకు భారీగా 3 లక్షల కోట్లు కేటాయించి, దేశంలో 10 కోట్ల మందికి ఉపాధి కల్పించారని చెప్పారు. మొల్లేటి వెంకటరమణ విశాఖలో 4 శాఖల ద్వారా గత 5 సం. లలో 18 వేల మందికి వృత్తి శిక్షణ ఇచ్చి, కొన్ని వేల మందికి ఉద్యోగాలు కూడా కల్పించారని ఈ సందర్భంగా ఆయనకు, వారి టీచర్స్, మాస్టర్లకు అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, టీచర్లు, మాస్టర్లు పాల్గొన్నారు.

## శ్రీ శ్రీ భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల

# తిరోభావ దినోత్సవ వేడుకలు

విశాఖపట్నం : హరే కృష్ణ మూవ్మెంట్ వ్యవస్థాపక ఆచార్యులు శ్రీశ్రీ భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల 43వ తిరోభావ దినోత్సవ పురస్కరించుకొని ఈ రోజు శ్రీ శ్రీ నితాయి గౌరంగా మందిరము, సీతమ్మధారలో వైభోగముగా నిర్వహించడం జరిగింది. ఈ సంద ర్భముగా మందిరమును పూలతో అలంకరించడం జరిగింది . భక్తులు ఉప వాస దీక్షలు పఠించినారు. శ్రీశ్రీశ్రీ భక్తి వేదాంత స్వామి ప్రభు పాదుల వారి విగ్రహమునకు అభిషేకము నిర్వహించడం జరిగింది. అనంతరము భక్తులకు శ్రీ నిష్కించిన భక్తదాస ప్రెసిడెంట్ హరే కృష్ణ మూవ్మెంట్ వారు భక్తులకు శ్రీశ్రీ భక్తి వేదాంత ప్రభుపాదుల జీవిత విశేషాలను తెలిపారు.

# తాగునీటి సమస్య లేకుండా చర్యలు

నాతవరం : గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేనపడుతున్నామని నాతవరం ఇన్చార్జ్ ఎంపిడిఒ ఎల్.యాదగిరీశ్వరరావు తెలిపారు. మండలంలో తాండవ జంక్షన్లో గత కొన్నాళ్లుగా తాగునీటి సమస్యతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని ఈ నెల 16న ప్రజాచైతన్య పాదయాత్రకు వచ్చిన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్గణేష్ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన ఆయన మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్యపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఎంపిడిఒ, ఆర్డబ్ల్యూఎస్ అధికారులు తాండవ జంక్షన్, గాంధీనగరం, శృంగవరం, గన్నవరం, వైబి.పట్నం గ్రామాల్లో తాగునీటి పథకాలు, కుళాయిలను పరిశీలించారు. తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు వచ్చే వేసవిని దృష్టిలో పెట్టుకొని ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా ముందస్తు జాగ్రత్తలు చేపడతామన్నారు. ప్రభుత్వం ఇంటింటికి కుళాయిల ఏర్పాటుకు నిధులు మంజూరు చేశామని చెప్పారు.

# ఆదర్శ కోఆపరేటివ్ సొసైటీ బాధితులకు న్యాయం చేయండి

## జిల్లా ఎస్పీకి మంత్రి కొడాలి నాని ఆదేశం



గుడివాడ : ఆదర్శ కోఆపరేటివ్ సొసైటీ బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్బాబును రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) ఆదేశించారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని కృత్తివెన్ను మండలం మునిపెడ గ్రామానికి చెందిన బాధితులు శివకోటి అనురాధ, మాజేటి పద్మ, కొంకటి లక్ష్మీ సరస్వతి, ముంతాజ్ తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృత్తివెన్నులో ఆదర్శ కోఆపరేటివ్ సొసైటీ బ్రాంచ్ను అడ్డపర్ర గ్రామానికి చెందిన చిలుకూరి సూర్యకుమారి, చిలుకూరి శ్రీనివాసరావులు ఏర్పాటు చేసి అధిక వడ్డీలు ఇస్తామని, దాదాపు రూ.1.30కోట్లు వసూలు చేశారన్నారు. మెచ్యూరిటీ గడువు ముగిసినప్పటికీ తిరిగి డబ్బులు చెల్లించ లేదన్నారు. అనేకసార్లు బ్రాంచి చుట్టూ తిరిగి ప్రాథేయపడినా ఇవ్వకుండా కాలయాపన చేశారన్నారు. మాపై నమ్మకంతో కట్టిన గ్రామస్థులు మమ్మల్ని నిలదీస్తున్నారని, వారికి సమాధానం చెప్పలేకపోతున్నామన్నారు. గత నెల 7వ తేదీన కృత్తివెన్ను పోలీస్టేషన్లో కూడా ఫిర్యాదు చేశామన్నారు. దీనిపై విచారణ జరిపించి బాధితులకు న్యాయం చేయాలని కోరారు. వెంటనే మంత్రి కొడాలి నాని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్బాబుతో ఫోన్లో మాట్లాడారు. బాధితుల దగ్గర ఆధారాలను పరిశీలించి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొడాలి నాని ఆదేశించారు.

# నూట అరవై మందికి వైద్య పరీక్షలు

భీమునిపట్నం : ఎస్ ఓ ఎస్ చిల్డ్రన్స్ విలేజ్ ఆధ్వర్యంలో తోటవీధిలో నిర్వహించిన వైద్య శిభిరం లో నూట అరవై మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు.

# నేడు అవంతీ పర్యటన

భీమునిపట్నం : జీవీఎంసీ భీమిలి డివిజన్ లో కోటి రూపాయల అభివృద్ధి పనులకు గురువారం రాష్ట్ర మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు శంఖుస్థాపన చేయనున్నారు.అనంతరం భీమిలి కృష్ణా కాలనీ యోగ ఆశ్రమం వద్ద నుండి ఎం అర్ ఓ కార్యాలయం వరకు బైక్ ర్యాలీ అనంతరం గంటస్థంభం వరకు పాదయాత్రలలో పాల్గొనున్నారు.

# డీలర్లను తొలగిస్తారన్న ప్రచారాన్ని నమ్మొద్దు

## రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని

గుడివాడ : రాష్ట్రంలో 2021 జనవరి 1వ తేదీ నుండి రేషన్ డోర్ డెలివరీ విధానం అమల్లోకి వస్తుందని, ఆ తర్వాత డీలర్లను తొలగిస్తారన్న ప్రచారాన్ని నమ్మొద్దని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని ఫెయిర్ ప్రైస్ షాప్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ విజయవాడ అధ్యక్షుడు మందాడి వెంకట్రావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి శివప్రసాద్, కోశాధికారి పోశంశెట్టి వీరవెంకట్రావు(పూర్ణ) తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వచ్చే జనవరి నుండి రాష్ట్రవ్యాప్తంగా మొబైల్ డిస్పెన్సింగ్ వ్యాన్ల ద్వారా రేషన్ బియ్యం, ఇతర సరుకులను డోర్ డెలివరీ విధానం ద్వారా కార్డుదారుని ఇంటి వద్దకు చేర్చే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టుగా తెలిసిందన్నారు. ఇప్పటి వరకు రేషన్ దుకాణాలకు పౌరసరఫరాల శాఖ ఆధీనంలో ఉన్న ఈ-పీడీఎస్ వెబ్సైట్లో ప్రతినెలా ఎన్ఐసీ ద్వారా పెడుతున్న కార్డుల జాబితాననురసరించి సరుకుల కోటాను కేటాయిస్తున్నారన్నారు. డోర్ డెలివరీ విధానం అమల్లోకి వస్తే సచివాలయాల్లో ఉన్న క్లస్టర్లలో మ్యాపింగ్ అయిన కార్డుల జాబితా ప్రకారం సరుకుల కేటాయింపు జరుగుతుందన్నారు. ఈ జాబితా ప్రకారమే ఆయా రేషన్ దుకాణాలకు కోటా నిర్ణయిస్తారన్నారు.

ప్రస్తుతం అమలవుతున్న విధానానికి, డోర్ డెలివరీ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత రేషన్ దుకాణాలకు కేటాయించిన జాబితాలో ఉన్న కార్డుల సంఖ్యకు వ్యత్యాసం ఉంటుందన్నారు. ఈ వ్యత్యాసం లేకుండా సచివాలయాల్లో ఉన్న రేషన్ కార్డులను, మండలం లేదా మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలకు సమానంగా కోటా వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు తిరువీధి శ్రీరాములు, కోశాధికారి సత్యనారాయణ, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పూర్ణ, గుడివాడ పట్టణ అధ్యక్షుడు పెదమల్లు వీరవెంకట సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ముప్పిడి రామ్మోహన్, నాయకులు ముప్పిడి నాగరాజు, మాగంటి నాంచారయ్య, శ్రీను, గుడ్లవల్లేరు మండల అధ్యక్షుడు వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

# 8వ రోజు వాకలపూడి పంచాయతీ కార్మికుల సమ్మె

## సానుకూలంగా స్పందించిన డిపిఓ

కాకినాడ రూరల్ : వేతనాలు పెంపుదల, పి.ఎఫ్.,ఈ.ఎస్.ఐ. తదితర డిమాండ్స్ అమలు చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ మండలం వాకలపూడి పంచాయతీ కార్మికులు అక్టోబర్ 14 నుండి 28 రోజుల ఆందోళన అనంతరం నవంబర్ 11 న ప్రారంభించిన సమ్మె 8 వ రోజు కొనసాగించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకట రమణ,యూనియన్ నాయకురాలు పిల్లి జ్యోతిలు మాట్లాడుతూ అధికారుల సమక్షంలో జీతాలు పెంచడానికి ఒప్పుకున్న పంచాయతీ కార్యదర్శి వారు తదుపరి మాట మార్చడం చాలా బాధాకరమన్నారు. కరోనా సమయం లో ప్రతి ఒక్కరూ పంచాయతీ కార్మికుల సేవల గురించి గొప్పగా చెప్పారని పేర్కొన్నారు. అయితే తమ కుటుంబాల పోషణకు ఇప్పుడు ఇస్తున్న జీతానికి అదనంగా రోజుకు రూ.33 పెంచాలని కోరుతున్నామన్నారు. గ్రామ ప్రజలు తమను చాలా బాగా ఆదరిస్తున్నారని, అధికారులు మానవతా దృక్పథంతో జీతాలు పెంపుదల అమలు చేయాలని కోరుతున్నామన్నారు. సిఐటియు నగర అధ్యక్షుడు పలివెల వీరబాబు జిల్లా పంచాయతీ అధికారి విక్టర్ గారితో ఫోన్ లో మాట్లాడగా సానుకూలంగా స్పందించారు. విజయవాడ సమావేశం నకు వెళుతున్నందువల్ల సోమవారం అందుబాటులో ఉంటానన్నారు. తన వద్దకు జీతాలు ప్రతిపాదన వచ్చిన వెంటనే అనుమతి మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు.మోరుకుర్తి కృష్ణ కుటుంబ సభ్యులు కార్మికులకు భోజనం ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు మాతా గాంధీ, దూలపల్లి అర్జున్, మేడే రాజు, గింజాల సత్తిబాబు, దేవర గోవింద్, పాలిక సూరిబాబు, వంకా దానయ్య, ఎర్ర పిల్లి బాబూజీ, గొర్ల రాజు, మేడే రాజు, మోరుకుర్తి వీరాంజనేయులు, మోకా కుమారి, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# సీఎం జగన్మోహన్ రెడ్డి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల తో స్పందన కార్యక్రమం

కాకినాడ : రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంగళవారం తాడేపల్లి ఆయన క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, జాయింట్ కలెక్టర్ల తో స్పందన కార్యక్రమాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. ఈ వీసి కి కాకినాడ కలెక్టర్ కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ డి.మురళీధర్ రెడ్డి, జాయింట్ కలెక్టర్లు జి.లక్ష్మీశ, కీర్తి చేకూరి లతో కలిసి పాల్గొన్నారు. నవరత్నాలు - పేదలందరికి ఇళ్ల స్థలాలు పంపిణీ, జగనన్న తోడు, జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో చేపడుతున్న సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, వైఎస్ఆర్ హెల్త్ క్లినిక్ లు, అంగన్ వాడీ భవనాలు నిర్మాణ పనుల పురోగతి , మన బడి - నాడు నేడు కార్యక్రమం, కోవిడ్ - 19 వంటి తదితర అంశాల పై ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో



జిల్లా రెవెన్యూ అధికారి, సి హెచ్.సత్తి బాబు, జెడ్.పి సిఇఓ ఎన్.వి.వి. సత్య నారాయణ, హౌసింగ్ పీడి జి.వి. ప్రసాద్, వ్యవసాయశాఖ జేడి కె.ఎస్.వి.ప్రసాద్, ఐసిడిఎస్ పీడి డి. పుష్పమణి, డిఇఓ ఎస్. అబ్రహం, డిఆర్ డిఏ పీడి వై.హరిహరనాథ్, మెప్మా పీడి శ్రీరమణి, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## స్నేక్ సేవా సొసైటీ అధ్యక్షులు

# స్నేక్ కిరణ్ కు ఘన సన్మానం

గాజువాక : కార్తీక నాగులచవితి సందర్భంగా అగనంపూడి పునరావాస కాలనీ అండమాన్ కొండయ్య వలస గ్రామ రామాలయ లో శ్రీ గౌరీ పరమేశ్వరులకు ప్రత్యేక పూజలు నిర్వహించిన కిరణ్ కుమార్ (స్నేక్ కిరణ్)ని ఎడిసి చైర్మన్ బలిరెడ్డి సత్య నారాయణ యూత్ సభ్యులు ఘనంగా సన్మానించారు. బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ రొక్కం కిరణ్ కుమార్ ప్రాణాలు పణంగా పెట్టి పాములకు సంరక్షణ కల్పించడంలో ఆయన చేస్తున్న సేవలను కొనియాడారు. ఉక్కు యాజమాన్యం ఆయనకు నివాసం ఏర్పాటు చేయడం జరిగిందని, జీవనోపాధి కొరకు ఒప్పంద కార్మికుడిగా నియామకం చేయాలని కోరారు. ఆయన ప్రపంచంలో మన దేశంలోని ఎన్నో గిన్నిస్ రికార్డులు అధిరోహించడం జరిగిందని అన్నారు. రొక్కం కిరణ్ కుమార్ మాట్లాడుతూ జన ప్రవంతిలో పాములు వలన హాని కలగకుండా సమాచారం తెలిసిన వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి పాములు పట్టుకుని జూకి అందజేయడం జరుగుతుందన్నారు. రెండు దశాబ్దాల నుండి సుమారు 25 వేల పాములను పట్టుకొని జూకి అందజేయడం జరిగిందని మా సొసైటీ 18 సభ్యులు విశాఖ జిల్లా వ్యాప్తంగా నాగుల చవితి సందర్భంగా పూజలు నిర్వహించే సందర్భంగా ప్రజలు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా తగు జాగ్రత్తలు తీసుకోవడం జరిగిందని అన్నారు. ఘనంగా సన్మానించిన సభ్యులకు పురప్రజలకు నాగదేవత ఆశీస్సులు కలగాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానికులు తదితరులు హాజరయ్యారు.

# భక్తి శ్రద్ధలతో నాగులచవితి

**భీమునిపట్నం : నాగులచవితి సందర్భంగా భీమిలి లో ప్రజలు భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జాము నుండి నగర శివారు ప్రాంతాల్లో పుట్టలనీ వెతికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు.**

## 76 వార్డు వైసీపీ అభ్యర్థి దొడ్డి రమణ ఆధ్వర్యంలో

# ఘనంగా శారద పీఠాధిపతి శ్రీ స్వరూప నరేంద్ర సరస్వతి స్వామి జన్మదిన వేడుకలు

గాజువాక : పెదగంట్యాడ పరిధి అయిన స్వతంత్ర నగర్ లో బుధవారం 76 వార్డు వైసిపి అభ్యర్థి దొడ్డి రమణ ఆధ్వర్యంలో శ్రీ శ్రీ జగద్గురు స్వరూప నరేంద్ర సరస్వతి స్వామివారి పుట్టినరోజు వేడుకలు ఘనంగానిర్వహించారు.

బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వైసిపి గాజువాక ఇంచార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ,శ్రీ శ్రీ వరాహలక్ష్మి నరసింహ స్వామి దేవస్థానం ధర్మ కర్తల మండలి సభ్యులు వారణాసి దినేష్ విచ్చేసి వారి చేతులమీదుగా కేక్ కట్ చేసి పుట్టిన రోజు శుభా కాంక్షలు తెలియ జేశారు. అనంతరం పేద మహిళ లకు వృద్ధులకు చీరలు, పండ్లు పంపిణీ చేశారు. దేవన్‌రెడ్డి మాట్లాడుతూ స్వామి వారు ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్ళు వర్ధిల్లాలని అలాగే స్వామి వారి కరుణ కటాక్షలు నియో జకవర్గ మరియు వార్డు ప్రజల అందరిపై అలాగే వైసీపీ కార్యకర్తలు పైన ఉండాలని ఆయన కోరుతున్నా నన్నారు.

ఈ కార్యక్రమంలో తాటికొండ జగదీష్ ,పిట్ట రెడ్డి, తాటికొండ అచ్యుత్, అండి బోయిన సన్నీ, వార చైతన్య, మురళి, సుధాకర్, మంత్రి మంజుల, పూడి శాంతి, ముంతాజ్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని అభినందించిన గురజాడ సాంస్కృతిక సంఘం సభ్యులు

విజయనగరం : ఇటీవల మూడు జాతీయ అవార్డులు సాధించిన విజయనగరం జిల్లా ఎస్పీ బి.రాజకుమారిని విజయ నగరం పట్టణానికి చెందిన గురజాడ సాంస్కృతిక సమాఖ్య సభ్యులు బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. గురజాడ సాంస్కృతిక సభ్యులు ఎ. గోపాలరావు, కాపుగంటి ప్రకాశరావు, మేకా కాశీ విశ్వేశ్వరరావులు జిల్లా ఎస్పీ బి.రాజకుమారిని జిల్లా పోలీసు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి, మూడు జాతీయ అవార్డులు లభించడం పట్ల తమ సంతోషాన్ని, ఆనందాన్ని వ్యక్తం చేసారు. ఈ సందర్భంగా గురజాడ సాంస్కృతిక అధ్యక్షులు ఎ.గోపాలరావు మాట్లాడుతూ కరోనాను నియంత్రించడంలో జిల్లా పోలీసు శాఖ విశేషమైన కృషి చేసిందని, ప్రజలకు కరోనా పట్ల అవగాహన కల్పించడంలోను, వలస కార్మికులకు సహాయపడడంలోను, వారిని గమ్య స్థానాలకు చేర్చేందుకు ఏర్పాట్లు చేయడంలోను, కరోనా ప్రబలుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విజయనగరం పట్టణంలో శ్రీ పైడితల్లమ్మ సిరిమాను ఉత్సవాన్ని కోవిడ్ నిబంధనలకు అనుగుణంగా నిర్వహించడంలోను జిల్లా ఎస్పీగా రాజకుమారి చేసిన సేవలుఎనలేనివన్నారు. దేశ స్థాయిలో విజయనగరం జిల్లాకు మంచి పేరును తీసుకువచ్చి, మూడు జాతీయ అవార్డులు సాధించడం చాలా గొప్ప విషయమని, జిల్లా ఎస్పీ రాజకుమారిని అభినందించి, సాలువతో ఘనంగా సత్కరించి, జ్ఞాపికను అందజేశారు.

ఈ కార్యక్రమంలో గురజాడ సాంస్కృతిక సభ్యులు ఎ.గోపాలరావు, కాపుగంటి ప్రకాశరావు, మేకా కాశీ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

# రేషన్ డీలర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోండి

## మంత్రి కొడాలి నానికి రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం వినతి

గుడివాడ : : గంపలగూడెం మండంలో రేషన్ డీలర్‌పై దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)ను కోరారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నానిని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మందాడి వెంకట్రావు, జిల్లా అధ్యక్షుడు ముత్యాల శేషగిరిరావులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గంపలగూడెం మండలంలో రేషన్ డీలర్ గంధం కుమారిపై సర్వర్ పనిచేయడం లేదనే కారణంతో అదే గ్రామానికి చెందిన రేషన్‌కార్డుదారుడు దాడి చేశారన్నారు. రేషన్ పంపిణీలో మహిళా డీలర్లు ఎంతో ధైర్యంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో జరిగిన దాడి కారణంగా మహిళా డీలర్లు భయాందోళనలకు గురవుతున్నారన్నారు. దాడి చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుని డీలర్లకు భరోసా కల్పించాలని వారు కోరారు. దీనిపై మంత్రి కొడాలి నాని జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్‌బాబుతో ఫోన్లో మాట్లాడారు. గంపలగూడెం మండలంలో డీలర్ కుమారిపై దాడి చేసిన ఘటనపై విచారణ జరిపి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొడాలి నాని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు తిరువీధి శ్రీరాములు, కోశాధికారి సత్యనారాయణ, విజయవాడ నగర ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, కోశాధికారి పూర్ణ, గుడివాడ పట్టణ అధ్యక్షుడు పెదమల్లు వీరవెంకట సత్య నారాయణ, ముప్పిడి రామ్మోహన్, నాయకులు ముప్పిడి నాగరాజు,నాంచారయ్య, వసంతరావు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ వ్యవస్థలో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో

# అర్హులైన 98 మంది మహిళా అభ్యర్థులు హాజరు

కాకినాడ : ఇటీవల సచివాలయ వ్యవస్థలో భాగంగా నిర్వహించిన పరీక్షల్లో జిఎంఎస్‌కె (గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శి), డబ్ల్యూఎంఎస్‌కె (వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శి) ఉద్యోగాలకు సంబంధించి 109 ఖాళీలు ఉండగా అర్హులైన 98 మంది మహిళా అభ్యర్థులకు బుధవారం జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పి డా.షేబాజ్ పాయ్ ఉత్తర్వుల ప్రకారం ఒరిజినల్ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిమిత్తం హాజరు కావాల్సిందిగా తెలియ పర్చడం జరిగింది. బుధవారం తూర్పుగోదావరి జిల్లా అడిషనల్ ఎస్పి అడ్మిన్ కె.కుమార్ ఆధ్వర్యంలో తూర్పుగోదావరి జిల్లా పోలీసు ప్రధానకార్యాలయం కాకినాడ నందు అర్హులైన అభ్యర్థుల యొక్క విద్యార్హతలు మరియు ఇతర ఒరిజినల్ సర్టిఫికెట్ ల వెరిఫికేషన్ జరిగినది.ఈ వెరిఫికేషన్ కు 98 మంది హాజరుకావల్సి ఉండగా 73 మంది అభ్యర్థులు మాత్రమే హాజరైనారు. ఈ ఒరిజినల్ ధ్రువపత్రాలు వెరిఫికేషన్ కార్యక్రమం అడిషనల్ ఎస్పి స్వీయ పర్య వేక్షణలో జిల్లా పోలీస్ కార్యాలయం కె.అనిల్ జాన్సన్, బి.వినయ్‌ల సమన్వయంతో పోలీస్ కార్యాలయం మినిస్టీరియల్ సిబ్బంది నిర్వహించారు. ముఖ్యంగా ఈ ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులు అందరూ మహిళా అభ్యర్థులు అయినందున వారియొక్క తక్షణ అవసరాల నిమిత్తం వారికి బుధవారం సాయంత్రం వారి వెరిఫికేషన్ పూర్తయ్యేవరకు వరకు, వారు ఎటువంటి ఇబ్బంది పడకుండా వారికికావలసిన వసతి సౌకర్యం, పోలీసు కార్యాలయ ఆవరణ నందు టెంట్ వేసి, వాటిలో కుర్చీలు మరియు టేబుల్స్ వేసి, త్రాగునీరు సౌకర్యం ఏర్పాటు చేయడం జరిగింది . వీరందరికీ సమన్వయకర్తగా దుర్గాదేవిని నియమించడం జరిగింది. ఈ సందర్భంగా అడిషనల్ కె. కుమార్ మాట్లాడుతూ ఇప్పుడు జరిగినది కేవలం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ మాత్రమేనని ఉద్యోగాలకు ఎంపిక కాబడిన అభ్యర్థులకు త్వరలో వారు ఎంపికైనట్టు మీకు ఎస్ఐసి ఎస్ఎంఎస్ ద్వారా మాత్రమే మెసేజ్ పంపడం జరుగుతుందని,అభ్యర్థులు ఇది గమనించాలని తెలియజేశారు.ఈ కార్యక్రమం లో అడిషనల్ఎస్పితో పాటు డ్రిఎస్పి ఎం.అంబికా ప్రసాద్ పాల్గొన్నారు.

### స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో

# ప్రజలను చంపే ప్రయత్నం చేయొద్దు

## ప్రభుత్వం చూస్తూ ఊరుకోదన్న మంత్రి కొడాలి నాని

గుడివాడ : స్థానిక సంస్థల ఎన్నికల పేరుతో రాష్ట్రంలో ప్రజలను చంపే ప్రయత్నం చేయొద్దని, రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ ఊరుకోదని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) అన్నారు. బుధవారం స్థానిక రాజేంద్రనగర్లోని నివాసంలో మంత్రి కొడాలి నాని విలేఖర్లతో మాట్లాడారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్కుమార్ హైదరాబాద్లో కూర్చొని వచ్చే ఏడాది ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహిస్తానని ప్రకటించారన్నారు. అయితే ఈ ఎన్నికలను నిర్వహించడానికి ప్రభుత్వం సిద్ధంగా లేదని రాష్ట్ర ప్రభుత్వం తరపున ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీలం సాహ్ని స్పష్టం చేశారన్నారు. ఒక్క పోలీస్శాఖలోనే 12వేల మంది ఉద్యోగులు కరోనా వైరస్ బారిన పడ్డారని, ఇంకా ఎన్నికల విధుల్లో పాల్గొనే రెవెన్యూ, విద్యాశాఖలో వేలాది మంది ఉద్యోగులకు కూడా కరోనా వైరస్ సోకిందన్నారు. వీరిలో చాలా మంది అనారోగ్య సమస్యలతో విధులకు దూరంగా ఉన్నారన్నారు. వచ్చే ఏడాది మార్చి నెల్లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్గా ఉన్న నిమ్మగడ్డ రమేష్కుమార్ పదవీ విరమణ చేయనున్నారని, ఈలోగా చంద్రబాబు ఏదో రకంగా రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను తప్పుడు మార్గంలో నిర్వహించేలా చేసి కొన్నైనా జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ స్థానాలను గెల్చుకోవాలని ప్రయత్నిస్తున్నారన్నారు. రాజ్యాంగ వ్యవస్థలో ఉన్న నిమ్మగడ్డ రాజకీయ పార్టీల ముసుగులో ఉంటున్నారని, వెంటనే ఆయన రాజీనామా చేయాలన్నారు. నిమ్మగడ్డకు రాజ్యాంగ వ్యవస్థలు, రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదన్నారు. చంద్రబాబు ఇచ్చిన అవకాశానికి నిమ్మగడ్డ ఆయనకు అనుకూలంగా వ్యవహరిస్తున్నారన్నారు. చంద్రబాబును నమ్ముకుని టీడీపీ శ్రేణులు, ఆ పార్టీ ఏ విధంగా దెబ్బతిన్నాయో నిమ్మగడ్డ ఇప్పటికే చూశాడన్నారు. ఇకనైనా పిచ్చి ప్రయత్నాలను మానుకోవాలన్నారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న నిమ్మగడ్డ హోదాకు తగ్గట్టుగా పదవీ విరమణ వరకు వ్యవహరించి తప్పుకోవాలని సూచించారు. అలా కాకుండా చిల్లర రాజకీయాలు, చిల్లర పనులు చేయవద్దన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే పదవీ విరమణ తర్వాత టీడీపీలో చేరి వచ్చే ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్నారు. ఆ ఎన్నికల్లో ఎవరి సత్తా ఏంటో తేల్చుకుందామని అన్నారు. ఈ ఏడాది మార్చి నెల్లో స్థానిక సంస్థల ఎన్నికల సమయాన్ని కుదించి నిర్వహించేందుకు ఇదే నిమ్మగడ్డ నోటిఫికేషన్ను ఇచ్చారన్నారు. ఎన్నికల ప్రక్రియ జరుగుతుండగా రాష్ట్రంలో నమోదైన రెండు, మూడు కరోనా కేసులను సాకుగా చూపి ఎన్నికలను వాయిదా వేశారన్నారు. అప్పటికి భారత ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం గాని కరోనాపై ఎటువంటి నిర్ణయాలు తీసుకోలేదని, లాక్డౌన్ ఆంక్షలను కూడా విధించలేదన్నారు. చంద్రబాబు చెప్పిన సలహాలను విన్న నిమ్మగడ్డ ఎన్నికలను నిలిపివేస్తూ నిర్ణయం తీసుకున్నారన్నారు. ఆ రోజు ఎన్నికలు నిర్వహించాలన్న ఆలోచనలోనే రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరిలో బ్యాలెట్ పద్ధతిలో పంచాయతీ ఎన్నికలను నిర్వహిస్తానని చెబుతున్నారన్నారు. చిన్న గ్రామంలో 12వార్డుల వరకు, పెద్ద గ్రామంలో 20వార్డుల వరకు ఉంటాయన్నారు. ఒక్కో ఓటరు రెండు, మూడు ఓట్లను వేయాల్సిన పరిస్థితుల్లో బ్యాలెట్ పద్ధతి వల్ల కరోనా వైరస్ మరింత వ్యాప్తి చెందే అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం వెయ్యి నుండి 1500వరకు కరోనా కేసులు నమోదవుతున్న సమయంలో కూడా బుద్ధి, జ్ఞానం లేకుండా ఎన్నికలు పెడతామంటున్నారన్నారు. అధికారులు కూడా ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా లేరన్నారు. స్థానిక ఎన్నికలపై మా నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పామని మంత్రి కొడాలి నాని తెలిపారు.

విలేఖర్లతో మాట్లాడుతున్న
రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని)

# ఆయురారోగ్య పుష్పాలు

సాధారణంగా పువ్వులు అనగానే దేవుడి అలంకారానికో...అమ్మాయి సిగలోనో కనిపిస్తూ ఉంటాయి. పువ్వులనగానే పవిత్ర భావనతోబాటు, శృంగార ఫీలింగ్స్ కలగడం మామూలే. అయితే మన నిత్యజీవితంలో వికసించిన పువ్వులు కొన్నయితే రుచిచూసే పువ్వులు కూడా కొన్ని ఉన్నాయి. పైగా అవి మన ఆరోగ్యానికి హామీ కూడా ఇస్తాయి. పుష్కలంగా విటమిన్లు ఉన్న ఈ తినే పూల గురించి తెలుసుకుందామా...

**కుంకుమపువ్వు:**

కుంకుమ పువ్వు జీర్ణశక్తిని పెంచుతుంది. రక్తప్రసరణను మెరుగుపరిచి రక్తపోటును తగ్గిస్తుంది. కుంకుమ పువ్వును పూర్వం చైనీయుల వైద్యంలో విరివిగా వాడేవారు. వారు ఎక్కువగా కాలేయ సామార్థ్యాన్ని పెంచేందుకు ఉపయోగించేవారు. ఆయుర్వేదంలో ఉదరం పని తీరును మెరుగుపరిచేందుకు, జీర్ణక్రియ సంబంధిత సమస్యల నివారణకు ఉపయోగిస్తారు.ఆకలిని క్రమబద్ధీకరించేందుకు, జీర్ణరసాల ప్రసరణకు, మోనోపాజ్ సమస్యల చికిత్సకు కూడా కుంకుమపువ్వును వినియోగిస్తారు. దగ్గు, కడుపుబ్బరం చికిత్సకూ వాడతారు. శారీరక రుగ్మతలతో పాటు డిప్రెషన్ను కూడా కుంకుమ పువ్వు తొలగిస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.శరీరంలో కామోద్దీపనలను పెంచే న్యూరో-ట్రాన్స్మిటర్లను, డోపమైన్ ఫైన్లను పృఎఎద్ధి చేస్తుంది. దీనిలో క్యాన్సర్ను నివారించే కీమో-ప్రివెంటివ్ లక్షణాలున్నట్లు కూడా తాజా పరిశో ధనలో గుర్తించారు. అయితే కిడ్నీ, నరాలకు ఇబ్బంది కలిగించే టాక్సిన్ దీనిలో వుంది కాబ ట్టి ఎక్కువ మోతాదులో వినియోగించవద్దని వె%ద్యుల సూచన.గర్భవతులు అయిన స్త్రీలు కుంకుమపువ్వు పాలల్లో వేసుకుని తాగితే పుట్టబోయే పిల్లలు మంచి రంగుతో పుడతారని అంటారు. అది వాస్తవమే అయినప్పటికీ కేవలం గర్భవతులే కాదు. కుంకుమ పువ్వును ఎవ్వరె%నా తీసుకోవచ్చు. కుంకుమ పువ్వు తీసుకోవడం వలన ఆరోగ్యం మరింత మెరుగవుతుందని వైద్యులు అంటున్నారు. ఎంతోకాలంగా మనం సుగంధద్రవ్యంగా వాడుతూనే ఉన్నాం. బిర్యానీలోనూ, కశ్మీరీ వంటకాల్లోనూ ఈ పువ్వును ఉపయోగిస్తాం. కుంకుమపువ్వులో యాంటీసెప్టిక్, యాంటీడి ప్రెసెంట్ గుణాలున్నాయి. క్యాన్సర్లతో పోరాడే యాంటీ ఆక్సిడెంట్స్ కూడా ఉన్నాయి.

**కాలీఫ్లవర్:**

గోబీ పువ్వు అని తెలుగులోనూ ఫూల్ గోబీ అని హిందీలోనూ పిలుచుకునే ఈ పువ్వు కూరలా వండుకోడానికి ఉద్దేశించినదే. గోబీ పకోడీలంటూ శ్నాక్స్ రూపంలోనూ కాలీఫ్లవర్ను తీసుకోవచ్చు. కాలీఫ్లవర్లోని సల్ఫోరఫేన్ వంటి వృఎఎక్షరసాయనాలు (ఫైటో కెమికల్స్) క్యాన్సర్లతో పోరాడతాయి. దాంతో ఈ పువ్వు క్యాన్సర్ను నివారిస్తుంది. సల్ఫోరఫేన్ అనే పోషకం ఆటిజమ్ను నివారించడంలో కూడా తోడ్పడుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే ఇవి ఇంకా పరిశోధన దశలోనే ఉన్నాయి. కాలీ ఫ్లవర్లోని ఇండోల్-3-కార్బినాల్ అనే స్టెరాల్ కూడా క్యాన్సర్కు వ్యతి రేకంగా సమరం చేస్తుంది. ప్రోస్టేట్, పెద్దపేగు, రొమ్ము, ఒవేరియన్ క్యాన్సర్ల నివారణకు సమర్థమైనది. కణాలు క్యాన్సరస్గా మారిపోతే అందులోనే అంతర్గతంగా క్యాన్సర్ను హరించే విషాలను (సైటోటాక్సి న్స్)ను పుట్టించి వాటిని తుదముట్టిస్తుందీ పువ్వు.

**బ్రకోలీ:**

బ్రకోలీ అనేది నిజానికి ఇటాలియన్ పేరు. ఇటాలియన్ భాషలో బ్రొకోలో అంటే క్యాబేజీ తాలూకు పుష్ప శిఖరాగ్రం (ఫ్లవరింగ్ క్రెస్ట్ ఆఫ్ క్యాబేజీ) అని అర్థం. గతంలో క్యాలీఫ్లవర్ అంతటి విస్తృఎతంగా లభ్యం కాకపో యినా... ఇప్పుడు మన మార్కెట్లలోనూ చాలా ఎక్కువగానే దొరుకుతోంది. ఇందులో విటమిన్ ఏ పాళ్లు చాలా ఎక్కువ. మేని నిగారింపుకూ, మంచి కనుచూపుకూ విటమిన్-ఏ దోహదపడుతుంది. ఇక ఇందులోని పోషకాలు (ఫైటోన్యూట్రియెంట్స్) శరీరంలో పేరుకుపోయిన అనే విషాలను తొలగించే డీ-టాక్సిఫైయర్స్గా ఉపయోగపడతాయి.

**అరటిపువ్వు:** ఇందులో ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, పీచుపదార్థం, కొవ్వులు, క్యాల్షియమ్, ఫాస్ఫరస్, ఐరన్, కాపర్, పొటాషియమ్, మెగ్నీషియమ్, విటమిన్ ఈ పుష్కలంగా ఉంటాయి. అరటిపువ్వుతో ఆరోగ్యానికి కలిగే మేలు అంతా ఇంతా కాదు. అరటిపువ్వుతో కూరలను వండి తినడం వల్ల ఎన్నో ప్రయోజనాలు చేకూరతాయి. అరటిలోని పోషకగుణాలు ఇన్ఫెక్షన్స్ తగ్గించడానికి ఉపయోగపడతాయి.

# తిన్న వెంటనే నీళ్లు తాగకూడదా?

మంచినీళ్లు ఎంత ఎక్కువ తాగితే అంత మంచిదని అందరూ అనుకుంటారు. ఆ మాటా నిజమే అయినా ఆహారం తీసుకున్న వెంటనే నీళ్లు తాగడం మాత్రం మంచిది కాదట. ఆహారం తిన్న వెంటనే నీటిని తాగడం మాత్రం జీర్ణప్రక్రియను ఆలస్యం చేస్తుందట. పొట్టలోని ఆమ్లాలను డైల్యూట్ చేసి జీర్ణప్రక్రియకు ఆటంకం కల్పిస్తుందట. అలాగే తీసుకున్న ఆహారంలోని విటమిన్లను, లవణాలను శరీరం శోషించుకోకుండా అడ్డుపడుతుందట. అందుకే భోజనం చేసిన అరగంట తర్వాతే మంచినీరు తీసుకోవాలట. తప్పదనిపిస్తే చాలా తక్కువ మొత్తంలోనే తాగాలట.

# బైడెన్ మంత్రివర్గంలో భారతీయులు



వాషింగ్టన్: అమెరికాలో డెమొక్రాట్ ప్రభుత్వం ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఓటమిని ఇంకా అంగీకరించని అధ్యక్షుడు ట్రంప్ అధికార మార్పిడికి సహకరించనప్పటికీ.. ఎన్నికల్లో గెలిచిన జో బైడెన్ పాలనా యంత్రాంగంపై దృష్టిపెట్టారు. మంత్రివర్గ కూర్పుపై కసరత్తులు మొదలుపెట్టారు. మొదట్నుంచీ భారత్పై సానుకూలంగా వ్యవహరిస్తున్న బైడెన్.. తన కేబినెట్లోనూ భారత అమెరికన్లకు చోటు కల్పించనున్నట్లు సమాచారం. ప్రముఖ భారత అమెరికన్లు వివేక్ మూర్తి, అరుణ్ మజుందార్ను తన మంత్రివర్గంలోకి తీసుకునే అవకాశాలున్నట్లు అమెరికా మీడియా కథనాలు పేర్కొన్నాయి. కొవిడ్ 19పై జో బైడెన్కు సలహాదారుగా ఉన్న వివేక్ మూర్తికి ఆరోగ్యంబీ స్టాన్ఫోర్డ్ యూనివర్శిటీ ప్రొఫెసర్ అరుణ్ మజుందార్కు ఇంధన శాఖ కేటాయించే అవకాశాలున్నట్లు 'ది వాషింగ్టన్ పోస్ట్', 'పొలిటికో' కథనాలు వెల్లడించాయి.

ఎవరీ వివేక్ మూర్తి..

45 ఏళ్ల వివేక్ మూర్తి అమెరికాలో మంచి పేరున్న వైద్యుడు. ఒబామా, ట్రంప్ పాలన సమయంలో దేశానికి సర్జన్ జనరల్గా బాధ్యతలు నిర్వహించారు. పబ్లిక్ హెల్త్ సర్వీస్ కమిషన్ కోర్కు వైస్ అడ్మిరల్ హోదాలో విధులు నిర్వహించారు. డాక్టర్స్ ఫర్ అమెరికా సంస్థను స్థాపించారు. కర్ణాటక నుంచి యూకేకు వలస వచ్చిన మూర్తి కుటుంబం.. ఆ తర్వాత అమెరికాలో స్థిరపడింది. ప్రతిష్టాత్మక హార్వర్డ్ విశ్వవిద్యాలయం, యేల్ విశ్వవిద్యాలయాల్లో మూర్తి చదివారు. కొన్ని నెలలుగా ఆయన బైడెన్కు కరోనాపై మార్గదర్శకత్వం చేస్తున్నారు. మేలో బైడెన్ ప్రచార బృందం ఏర్పాటు చేసిన హెల్త్ టాస్క్ ఫోర్స్కు కాంగ్రెస్ మహిళ ప్రమిలా జయపాల్తో కలిసి నేతృత్వం వహించారు. అధికార మార్పిడి తర్వాత బైడెన్ నియమించే కొవిడ్-19 అడ్వైజరీ బోర్డుకు వివేక్ మూర్తి సహ అధ్యక్షుడిగా వ్యవహరించనున్నారు.

అరుణ్ మజుందార్..

మెకానికల్ ఇంజినీరింగ్ ప్రొఫెసర్ అయిన అరుణ్ మజుందార్ అడ్వాన్స్డ్ రీసర్చ్ ప్రాజెక్ట్స్ ఏజెన్సీ-ఎనర్జీ (ఏఆర్పీఏ-ఇ)కి తొలి డైరెక్టర్గా పనిచేశారు. 2009లో అప్పటి అధ్యక్షుడు ఒబామా.. అరుణ్ మజుందార్ను ఈ పదవికి నామినేట్ చేశారు. సెనేట్ ఆమోదముద్ర వేసింది. 2012 వరకు అరుణ్ డైరెక్టర్ ఆ పదవిలో కొనసాగారు. ఆ తర్వాత గూగుల్లో చేరిన ఆయన.. ఆ సంస్థ ఎనర్జీ విభాగానికి ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. ఇంధన సంబంధిత విషయాల్లో బైడెన్కు ముఖ్య సలహాదారుగా వ్యవహరిస్తున్నారు.

## కామన్వెల్త్లోకి మళ్లీ.. క్రికెట్!

## అర్హత ప్రక్రియ ఆరంభించిన ఐసీసీ, సీజీఎఫ్

దుబాయ్: కామన్వెల్త్ క్రీడల్లో క్రికెట్కు పునఃప్రవేశం లభించింది. 2022లో నిర్వహించే కామన్వెల్త్ మహిళల టీ20 క్రికెట్ పోటీలకు అర్హత ప్రక్రియ మొదలైంది. వచ్చే ఏడాది ఏప్రిల్ 1 నాటికి ఆతిథ్య ఇంగ్లాండ్ సహా వరుసగా అత్యధిక ర్యాంకుల్లో కొనసాగుతున్న ఆరు జట్లకు నేరుగా అర్హత లభిస్తుంది.

నాలుగేళ్లకు ఒకసారి జరిగే కామన్వెల్త్ క్రీడల్లో 1998లో పురుషుల క్రికెట్ భాగమైంది. కౌలాలంపూర్లో జరిగిన క్రీడల్లో క్రికెట్ పోటీలు పెట్టారు. ఆ తర్వాత నిలిపేశారు. మళ్లీ ఇన్నేళ్లకు మహిళల క్రికెట్ రూపంలో భాగస్వామ్యం లభించింది.

కామన్వెల్త్ క్రికెట్ పోటీల్లో మొత్తం ఎనిమిది జట్లు పోటీపడతాయి. ఆతిథ్య ఇంగ్లాండ్కు ఎలాగూ చోటుఉంటుంది. ఆ తర్వాత ర్యాంకింగ్స్లో తొలి ఆరు స్థానాల్లోని జట్లకు నేరుగా అర్హత లభిస్తుంది. మిగిలిన ఆ ఒక్క జట్టునూ తర్వాత ప్రకటిస్తారు. 2022, జనవరి 31లోపు జరిగే అర్హత పోటీల్లో విజేతకు చోటు లభిస్తుంది. ఎడ్జ్బాస్టన్ వేదికగా క్రికెట్ మ్యాచులు జరుగుతాయి. ఇప్పటివరకు కరీబియన్ దీవులు ఏ దేశానికి ఆ దేశం ప్రత్యేకంగా ప్రాతినిధ్యం వహించాయి. ఈ నేపథ్యంలో వెస్టిండీస్ తొలి ఆరు స్థానాల్లో గనక నిలిస్తే మరో జట్టుకు అవకాశం దొరకనుందని సమాచారం.

కామన్వెల్త్ క్రీడలు బర్మింగ్ హామ్ వేదికగా 2022లో జులై 28 నుంచి ఆగస్టు 8 వరకు జరుగుతాయి. ప్రస్తుతం భారత మహిళల టీ20 జట్టు నాలుగో స్థానంలో ఉంది. ఇంగ్లాండ్ మూడో ర్యాంకులో కొనసాగుతోంది.

'మహిళల క్రికెట్కు ప్రపంచవ్యాప్తంగా ఆదరణ పెరిగేందుకు కామన్వెల్త్ క్రీడలు ఓ అద్భుతమైన అవకాశం' అని ఐసీసీ సీఈవో మను సాహ్నీ అన్నారు. 'కామన్వెల్త్లో క్రికెట్ను చేర్చడం క్రీడాకారులకు గొప్ప అవకాశం. ఆ క్రీడల్లో టీమ్ఇండియా కచ్చితంగా పాల్గొంటుంది. నాణ్యమైన క్రికెట్ ఆడుతూ విజయవంతం అవుతుందని నా విశ్వాసం' అని టీమ్ఇండియా టీ20 సారథి హర్మన్ప్రీత్ కౌర్ ధీమా వ్యక్తం చేసింది.

## మెట్రో రైల్లో సైకిల్!

## కేరళలో నూతన ప్రయోగం.. ప్రారంభించిన కోచి మెట్రో

కోచి: చక్కని ఆరోగ్యాన్ని అందించే వ్యాయామాల్లో సైకిల్ తొక్కడం ఒకటి. అంతేకాకుండా ఈ అలవాటు పర్యావరణానికీ మేలు చేస్తుంది. ఈ కరోనా కాలంలో షేర్ ఆటోలు తదితర వాహనాల్లో ఇళ్లకు చేరేందుకు ప్రజలు సందేహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సైక్లింగ్ వల్ల లభించే ప్రయోజనాలను గుర్తించిన కేరళలోని కోచి మెట్రో రైల్ సంస్థ.. మెట్రోల్లో సైకిళ్లను తీసుకెళ్లేందుకు అనుమతించింది. కాగా, ఈ సదుపాయాన్ని ఉచితంగా అందించటం విశేషం. ప్రయాణికులు మాత్రమే టికెట్ తీసుకుంటే సరిపోతుందని అధికారులు తెలిపారు.

ప్రయాణికులు మెట్రో స్టేషన్ల నుండి తమ గమ్యస్థానాలను చేరుకునేం దుకు అనువుగా.. ఆరోగ్యకర జీవన విధానానికి ప్రోత్సాహంగా తామీ నిర్ణయం తీసుకున్నట్టు కోచి మెట్రో ఎండీ అల్కేష్ కుమార్ శర్మ వివరించారు. తొలుత ఆరు స్టేషన్లలో మాత్రమే లభిస్తున్న ఈ వెసులుబాటును.. ప్రయాణికుల ఆదరణను బట్టి త్వరలోనే అన్ని స్టేషన్లకు విస్తరిస్తామని హామీ ఇచ్చారు. అంతేకాకుండా కోచి మెట్రో ప్రయాణికుల సౌకర్యార్థం తమ పరిధిలోని 12 రూట్లకు ఆటో సదుపాయాన్నీ ప్రారంభించింది.

## రబీకి అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలి

### సూచనలిస్తున్న కలెక్టర్ జె.నివాస్

శ్రీకాకుళం : రబీలో రైతులకు అవసరమైన విత్తనాలను సరఫరా చేయాలని కలెక్టర్ జె.నివాస్ పేర్కొన్నారు. శ్రీకాకుళం జడ్పీ సమావేశ మందిరంలో వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేరుశెనగ, మినుములు, పెసలు, రాగులు వంటి విత్తనాల సరఫరాకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. మండలాల వారీగా రైతులతో సమావేశాలు నిర్వహించి వివరాలను సేకరించాలన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను డిసెంబరు మొదటి వారంలో ప్రారంభించాలని చెప్పారు. స్వచ్ఛంద సంస్థలకు కొన్ని కేంద్రాల నిర్వహణ అప్పగించామని జేసీ సుమిత్కుమార్ తెలిపారు. వారికి అవసరమైన పరికరాలను అందిస్తామని, సక్రమంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ జేడీ కె.శ్రీధర్, పౌరసరఫరాల సంస్థ మేనేజరు ఎ.కృష్ణారావు, తదితరులు పాల్గొన్నారు.

## వైకాపా సిద్ధం కావాలి : యనమల

అమరావతి: ఆంధ్రప్రదేశ్లో స్థానిక సంస్థల ఎన్నికల వేడి రాజుకుంది. ఎన్నికల ప్రక్రియ నిర్వహించేందుకు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేశ్ కుమార్ సన్నద్ధమవుతుండగా.. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో ఎన్నికల నిర్వహణ సాధ్యం కాదని చెబుతోంది. దీంతో స్థానిక ఎన్నికలపై రాజకీయ వర్గాల్లో మాటల యద్ధం కొనసాగుతోంది. ఓటమి భయంతోనే ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికలంటే వైకాపా వెనుకంజ వేస్తోందని శాసనమండలి ప్రతిపక్షనేత యనమల రామకృష్ణుడు అన్నారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ...కేంద్రానికి, ఇతర రాష్ట్రాలకు లేని కరోనా సాకులు వైకాపా ఎందుకు చెబుతోందని ప్రశ్నించారు. బాధిత వర్గాలన్నీ వ్యతిరేకంగా ఓటేస్తారనేదే వైకాపా భయమని విమర్శించారు.

ముస్లింలు, ఎస్సీలు, ఎస్టీలు, బీసీల్లో వ్యతిరేకత చూసే వెనక్కితగ్గుతున్నారని ఆరోపించారు. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ఎన్నికలు జరిగితే ఓడిపోతామని వైకాపా నేతలకు భయం పట్టుకుందన్నారు. దమ్ముంటే ఫిబ్రవరిలో స్థానిక ఎన్నికలకు వైకాపా సిద్ధం కావాలని సవాల్ విసిరారు. గతంలో జరిగిన బలవంతపు ఏకగ్రీవాలు పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

# అదిశంకరుని అడుగుజాడలే విశాఖ శారదా పీఠానికి స్ఫూర్తి

- పీఠాధిపతులు స్వరూపానందేంద్ర
- సాంప్రదాయబద్ధంగా పీఠాధిపతుల జన్మదిన వేడుక
- శాస్త్రోక్తంగా వేద సభ
- స్వామీజీ ఆశీస్సులు అందుకున్న ప్రముఖులు

విశాఖపట్నం : విశాఖ శ్రీ శారదా పీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి జన్మదిన వేడుకలు సాంప్రదాయబద్ధంగా సాగాయి. బుధవారం నాగుల చవితి పర్వదినాన పీఠం ప్రాంగణంలో భక్తులు ఈ వేడుకలు నిర్వహించారు. స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా అనేకమంది ప్రముఖులు పీఠాన్ని సందర్శించి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా స్వామి స్వరూపానందేంద్ర అనుగ్రహ భాషణం చేసారు. వేద పరిరక్షణ, హైందవ ధర్మ రక్షణ ధ్యేయంగా విశాఖ శ్రీ శారదాపీఠం ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. ధర్మం కోసం ఉద్యమించిన పీఠంగా విశాఖ శ్రీ శారదా పీఠాన్ని అభివర్ణించారు.

మతం కోసం ఏ ఒక్కరూ నోరు మెదపని రోజుల్లోనే నిర్భయంగా తాను మాట్లాడానని చెప్పారు. హిందూమతాన్ని ఉద్ధరించే వారిలో బ్రాహ్మణ జాతి తర్వాతే ఎవరైనా ఉంటారని స్పష్టం చేసారు. కాషాయం జెండా పట్టుకున్నంత మాత్రాన మతం నిలబడదని, ఇపుడైతే హిందూ మతం కోసం ఎంతోమంది పోరాడుతున్నారని తెలిపారు.

భారత దేశపు మూలాల నుంచి అద్వైత సిద్ధాంతాన్ని వెలికితీసింది ఆదిశంకరాచార్యులేనని, ఆయన ఆలోచనలను తలుచుకుంటూ పురుడుపోసుకున్నదే విశాఖ శ్రీ శారదా పీఠమని వివరించారు. తమ పీఠం సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఉపాసనతో అభివృద్ధి సాధించిందని, రాజ శ్యామల అమ్మవారి ఆరాధనతో ప్రఖ్యాతి చెందిందని చెప్పారు. ఆత్మ జ్ఞానం గురించి నిరంతరం తమ పీఠంలో చర్చ జరుగుతూ ఉంటుందని వివరించారు.

పీఠాధిపతులు స్వరూపానందేంద్రకు ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర స్వామి వేకువజామునే కూపి స్నపనం(అభ్యంగన స్నానం) చేసారు. అనంతరం పీఠం ప్రాంగణంలోని దేవతామూర్తుల ఆలయాలను సందర్శించి శమీవృక్షం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత షణ్ముఖ సుబ్రహ్మణ్య స్వామి విగ్రహానికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి స్వరూపానందేంద్రకు ఉత్తర పీఠాధిపతులు స్వాత్మానందేంద్ర పాద పూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూర్యచంద్రులతో గురువులు సమానమని అభివర్ణించారు. అజ్ఞానాన్ని తొలగించి జ్ఞానాన్ని ప్రసాదించే గురువులను విస్మరిస్తే ముప్పు తప్పదన్నారు.

విశాఖ శ్రీ శారదాపీఠం విలక్షణమైనదని, యావత్ భారతం ఈ పీఠంవైపు చూస్తోందంటే అది గురువుల కృప మాత్రమేనని స్పష్టం చేశారు. పీఠం ప్రాంగణంలో స్వామీజీ జన్మదినోత్సవం సందర్భంగా పెద్దఎత్తున వేద సభ నిర్వహించారు. నాలుగు వేదాలు, వివిధ శాఖలకు చెందిన వేద పండితులు ఈ సభకు హాజరయ్యారు. స్వామీజీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మూడువేల మంది నిరుపేద మహిళలకు చీరలను పంపిణీ చేశారు.

## ప్రముఖులకు పీఠాధిపతుల ఆశీస్సులు

విశాఖ శ్రీ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ మహాస్వామి జన్మ దినోత్సవం సందర్భంగా అనేకమంది ప్రముఖులు పీఠాన్ని సందర్శించి స్వామీజీ ఆశీస్సులు అందుకున్నారు. మంత్రులు అవంతి శ్రీనివాస్, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, పార్లమెంటు సభ్యులు ఎంవీవీ సత్యనారాయణ, సత్యవతి, ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్, మాజీ ఎమ్మెల్సీలు చైతన్య రాజు, దాడి వీరభద్ర రావు, కళా హాస్పిటల్ అధినేత డాక్టర్ పైడి వెంకటరమణ మూర్తి, మాజీ కేంద్రమంత్రి కిల్లి కుఫారాణి, బొగ్గు శ్రీను, డాక్టర్ రామ్ కుమార్, విజయభాను అధినేత చంద్రశేఖర్, కళింగం కార్పొరేషన్ డైరెక్టర్ పద్మావతి, తదితరులు స్వామీజీ ఆశీస్సులు అందుకున్న వారిలో ఉన్నారు.

మహాస్వామి జన్మదినోత్సవం సందర్భంగా పేదలకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి వారు, స్వాత్మానందేంద్ర సరస్వతి మహాస్వామి వారితో వైకాపా రాష్ట్ర కార్యదర్శి, లక్ష్మీ ఎంటర్ప్రైజెస్ అధినేత చొక్కాకుల వెంకట్రావు

స్వామి వారి భక్తులు, జై భారత్ నగర్ గ్రామ అధ్యక్షుడు డాక్టర్ బొగ్గు శ్రీను, ఎల్లాజీ

శ్రీ చరణుల ఆశీస్సులు అందుకుంటున్న ఆంధ్ర ట్రైమ్స్ ఎడిటర్, ఏపీ కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బెందాళం పద్మావతి బాలకృష్ణ దంపతులు

## 14వ వార్డ్ లో శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి జన్మదిన వేడుకలు

విశాఖపట్నం : విశాఖ ఉత్తర నియోజకవర్గం 14 వ వార్డు పరిధిలో బిలాల్ కాలని నగర్లో శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త శ్రీ కె కె రాజు గారు సూచనలు మేరకు 14 వ వార్డు వైసీపీ అభ్యర్థి కె.అనిల్ కుమార్ రాజు గారి ఆధ్వర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణి చేశారు. అనంతరం అనిల్ కుమార్ రాజు మాట్లాడుతూ కరోనా విపత్తు సమయంలో శ్రీ శ్రీ శ్రీ స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి లోక కళ్యాణం కోసం అనేక ప్రత్యేక పూజలు నిర్వహించారన్నారు. అటువంటి ఆధ్యాత్మిక చింతన కలిగిన స్వామివారి జన్మదిన వేడుకలు నిరుపేదల మధ్య జరుపుకోవడం ఎంతో సంతృప్తిని స్తుందన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని వార్డు పరిధిలో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు స్వరూప్, సింహాచలం, అప్పన్న, నాగరాజు, సంఘద్దీన్, భాష తదితరులు పాల్గొన్నారు.

## పన్ను వసూళ్లను వేగవంతం చేయండి

### జివిఎంసి అదనపు కమిషనర్ ఆషా జ్యోతి

విశాఖపట్నం : జివిఎంసికి చెల్లించవలసిన పన్నులు శతశాతం వసూలు చేయాలని జివిఎం సి కమిషనర్ డాక్టరు జి. సృజన ఆదేశించారు. బుదవారం, జివియం సి సమావేశమందిరంలో జోనల్ కమిషనర్లు, రెవెన్యూ ఆఫీసర్లు, రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్లతో సమావేశం నిర్వహించారు. 2020 - 21 ఆర్థిక సంవత్సరమునకు సంబందించి ఆస్తి, ఖాళీ స్థలాల పన్ను, నీటి చార్జీలు, కళ్యాణమండపాలు, షాపులు, మార్కెట్ల నుండి రావలసిన లీజు బకాయిలు పూర్తిగా వసూలు చేయాలని ఆదేశించారు. అదాయం సకాలంలో వసూలు చేయకపోతే ప్రజలకు అందించవలసిన మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనులకు ఆర్థిక ఇబ్బందులు కలుగుతాయన్నారు. పన్ను వసూళ్ళలో వెనుకబడ్డ రెవెన్యూ ఆఫీసర్లను, రెవెన్యూ ఇన్స్ స్పెక్టర్లను తీవ్రంగా హెచ్చరించారు. నూతనంగా కట్టిన భవనాలకు, వినియోగ మార్పిడి జరిగిన భవనాలు, పన్ను పరిధిలోకి రాని ఖాళీ స్థలాలను, అసంపూర్ణంగా కట్టి వదిలేసిన అపార్ట్మెంట్లను గుర్తించి, వెంటనే పన్నులు విధించాలని ఆదేశించారు. ఒకే డోర్ నెంబర్లతో రెండు అసెస్మెంట్లు కొన్ని చోట్ల ఉన్నాయని అటువంటి వాటిని వార్డు ఎమినిటీ కార్యదర్శుల సాయంతో గుర్తించి డోర్ నెంబరు మార్పులు చేర్పులు చేయాలన్నారు. కొత్తగా కట్టిన భవనములు, ఇళ్ళు, దుకాణములు వార్డు ఎమినిటీ కార్యదర్శుల సాయంతో గుర్తించి వాటికి పన్నులు వేయాలన్నారు.

VIJAYABHANU - Visakhapatnam
Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of VIJAYABHANU PUBLICATIONS PVT. LTD., Published and Printed at VIJAYABHANU PRESS, D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ⋆ Phone : 2564353, Fax : 0891-2569004 ⋆ e-mail: vijayabhanudaily@gmail.com